ది బొంబాయి ఆంధ్ర మహాసభ & జింఖానా
The Bombay Andhra Mahasabha & Gymkhana
సంపుటి - 80 సంచిక - 05 జులై - 2014

# దర్పణం

తెలుగు భాషా, సాహితీ, సంస్కృతి, కళల, క్రీడల వార్తా విశేషాల..



ప్రత్యేక వ్యాసం... పేజి 17లో...





## సమస్త భారతీయులందరికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

# Sri Sai Enterprises

**CIVIL, ELECTRICAL ENGINEERS & CONTRACTORS**

**(An ISO 9001: 2008 Certified Company)**

Tel. (Off.): 022 6525 0965
Telefax : 022 2781 0463
Mob. : +91 93236 40922



Prop. Kasi Reddy

**Off.: Shop No. 14, Shivshankar Bldg.-II, Sector - 15**
**Plot No. 17, Sanpada, Navi Mumbai - 400 705**

**E-Mail: srisai_kreddy@yahoo.co.in**
**Website: www.srisaikreddy.com**

# ది బొంబాయి ఆంధ్ర మహాసభ & జింఖానా

## The Bombay Andhra Mahasabha & Gymkhana

10-C, Lakhamshi Napoo Road, Dadar (E), Mumbai - 400014, Tel.: 24144377 / 24144388, Fax : 24119832

E-mail: mahasabha@gmail.com Web: www.thebombayandhramahasabha.com


# దర్పణం


అధ్యక్షులు / సంపాదకత్వం

సంకు సుధాకర్

ప్రధాన కార్యదర్శి / సహకారం

యాపురం వెంకటేశ్వర్

పదాధికారులు

అనుమల్ల రమేశ్
ఉపాధ్యక్షులు, పరిపాలనా శాఖ

గట్టు నర్సయ్య
ఉపాధ్యక్షులు, సాంస్కృతిక శాఖ

నడిమెట్ల యెల్లప్ప
ఉపాధ్యక్షులు, సాహిత్య, జింఖాన

రాపెల్లి పరమేశ్వర్
కోశాధికారి

యెలిగేటి రాజ్‌కుమార్
సంయుక్త కార్యదర్శి, పరిపాలనా శాఖ

శ్రీమతి రాధామోహన్
సంయుక్త కార్యదర్శి, సాంస్కృతిక శాఖ

వేముల మనోహర్
సంయుక్త కార్యదర్శి, సాహిత్య, జింఖాన

ఏ.వి. నాగేశ్వరరావు
పి. ఆర్. ఓ.

బడుగు విశ్వనాథ్
కార్యవర్గ సభ్యులు

సమన్వయ సంపాదకులు

సంగెవేని రవీంద్ర

సంపాదక సలహాదారులు

ఏ. మల్లికార్జునరెడ్డి

సహ సంపాదకులు

డా॥ పాము మనోహర్


## ఒక మాట

**మహాసభ సభ్యులకు, శ్రేయోభిలాషులందరికీ నమస్కారం...!**

లక్ష్యసాధన పట్ల చిత్తశుద్ధి ఉంటే అనుకున్నది సాధించడం అసాధ్యమేమీ కాదు. సంస్థకోసం, సమన్వయం కోసం, సంక్షేమం కోసం, మన జాతికోసం తమ స్వార్థాన్ని వదులుకొని, సభ్యుల మనోభావాలను గౌరవిస్తూ నిరంతరం కృషిచేస్తే విజయం మనకు చేరువవుతుంది. మేం అదే పనిలో ఉన్నాం.

మాకు లభించిన అధికారాన్ని మేం అధికారంగా భావించడం లేదు. మా వంతు కర్తవ్యాన్ని నిర్వహించేందుకు లభించిన ఒక అవకాశంగా మాత్రమే చూస్తున్నాం. మీ ఆకాంక్షలకు అనుకూలంగా మేం మహాసభని ప్రగతిపథంలో పరుగెత్తించేందుకు మీకిచ్చిన మాట ప్రకారం పలు సబ్‌కమిటీలను ఏర్పాటు చేశాం. పలు రంగాల్లో నిష్ణాతులైన వారితో నియమించిన కమిటీలు తమ పనుల్ని ప్రారంభించాయి. అద్భుతమై రేపటి మహాసభ భవిష్యత్ నిర్మాణంలో కమిటీ సభ్యులు నిమగ్నమై ఉన్నారు.

ఇప్పటికీ మహాసభ కార్యాలయ రూపురేఖల్ని ఆహ్లాదకరంగా మార్చేశాం. సేవాపరంగా కూడా పలుమార్పులు చేపట్టేందుకు అనుకూలంగా నూతన స్టాఫ్‌ను కూడా భర్తీ చేస్తున్నాం. అక్కౌంట్స్ అన్నీ పారదర్శికంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాం. జరిగిన, జరగబోతున్న పాజిటివ్ చేంజ్‌ను మీరు త్వరలోనే గ్రహిస్తారు.

సభ్యులందరికీ మా వంతుగా ఒకటే మనవి...!

ముంబైలోని మిగతా జింఖానాల్లాగే మన మహాసభను కూడా పూర్తిగా ఆధునీకరణ చేసేందుకు మనమంతా కలలు కంటున్నాం. ఆ కలలు సాకారం చేసేందుకు మేం తీవ్రంగా ప్రయత్నిస్తున్నాం. మా ప్రయత్నాల ఫలాలు మీరు త్వరలోనే గ్రహిస్తారు. మీరు మాపట్ల పూర్తి విశ్వాసాన్ని ఉంచి, మా సంకల్పాన్ని అర్థం చేసుకొని సహకరించాలనీ, అసత్య, అసందర్భ ప్రచారాలను పట్టించుకోకుండా సభాగౌరవాన్ని మాత్రమే దృష్టిలో పెట్టుకోవాలనీ కోరుతున్నాం.

అంతేగాక, మన పిల్లల్లో **IAS / IPS / IFS / IRS** పట్ల అవగాహన పెంచేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. అందులో భాగంగానే జులై 13 నాడు ఐఏఎస్, ఐపీఎస్ విషయాల పై అవగాహన పెంచేందుకు ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించాం. రాబోయే స్వాతంత్ర్య దినోత్సవం నాడు పేదరికం అంచుల్లో ఉండి ఉన్నత విద్యను అభ్యసించాలని కోరుకునే విద్యా ర్థుల కోసం అత్యధికంగా సహాయాన్ని అందించాలని ప్రయత్నిస్తున్నాం.

దర్పణం పట్ల పెరుగుతున్న మీ అభిమానం మాకు ఆనందం కలిగిస్తోంది. మీ మీ రచనలు పంపి దర్పణాన్ని సాహితీపత్రికలా మార్చేందుకు సహకరించండి..! అందరికీ శుభమగుగాక...!!

మరొక్కసారి కృతజ్ఞతా పూర్వకముగా ....!

Sudhakar

మీ సంకు సుధాకర్
అధ్యక్షులు

# పాఠక దర్పణం

## సబ్‌కమిటీల ఏర్పాటు బాగుంది

ఆంధ్రమహాసభకు పునర్‌వైభవం తీసుకొచ్చేందుకు ధర్మకర్తల మండలి, కార్యవర్గం కలిసి సబ్‌కమిటీలు ఏర్పాటు చేయడం గొప్పవిషయం. సబ్‌కమిటీల సభ్యులంతా కూడా వివిధ రంగాల్లో ఆరితేరినవారే కావడం వల్ల మహాసభకు తప్పకుండా మంచి జరుగుతుందని విశ్వసిస్తున్నాం. అయితే నూతన కార్యవర్గం వచ్చిన తర్వాత దర్పణంతో పాటు సబ్‌కమిటీల ఏర్పాటు, కార్యాలయంలో మార్పులు తదితర విషయాలు బాగానే ఉన్నా నాణ్యమైన సాంస్కృతిక, సాహితీ కార్యక్రమాలు కూడా నిర్వహించి మహాసభ సాంప్రదాయాన్ని కాపాడాలనీ మనవి చేస్తున్నాను.

– మర్రి జనార్ధన్, వర్లీ

## కవితలు బాగున్నాయి

మహాసభ కార్యవర్గం ఎంతో వ్యయప్రయాసలకోర్చి దర్పణం పత్రికను వెలువరించడం చాలా మెచ్చుకోవాల్సిన అంశం. ఎందుకంటే మహారాష్ట్రలో తెలుగు భాష వికాసం కోసమే దాదాపు 85 సంవత్సరాల క్రితం కొందరు త్యాగధనులు ఆంధ్రమహాసభను స్థాపించారు. దర్పణం పత్రిక తెలుగు భాషకు సేవచేస్తున్నట్లుగానే భావించాలి. ఈ పత్రికను మహాసభ కరపత్రంగా ప్రతినెలా తప్పనిసరిగా తీసుకువచ్చేలా ఏర్పాటు చేస్తే బాగుంటుంది. కార్యవర్గాలు మారినా దర్పణం ఆగకుండా ఏదో ఒక ఏర్పాటు చేయాలనీ మనవి.

– వంగళ మధుసూధన్, వాషి

## కథను ప్రచురించండి

దర్పణం చాలా బాగా వస్తున్నందుకు సంతోషంగా ఉంది. గతంలో దర్పణం రెగ్యులర్‌గా వచ్చి ఆగిపోయింది. నూతన కార్యవర్గం అధికారం చేపట్టిన తర్వాత దర్పణాన్ని తిరిగి ప్రారంభించడం అభినందనీయం. వీలుంటే కొన్ని పేజీలు పెంచి మరికొన్ని శీర్షికలకు చోటు కల్పించాలనీ మనవి. అంతేగాక, ప్రతి సంచికలో ఒక కథ కూడా ప్రచురిస్తే బాగుంటుంది. సంపాదక వర్గానికి ధన్యవాదములు.


– అందె రాజశేకర్, వర్లీ

## పరిపూర్ణ పత్రిక

దర్పణం ఆంధ్రమహాసభ సభ్యుల కోసమే అయినప్పటికీ పాఠకుల ఆదరణ పొందేలా తీర్చిదిద్దుతున్నందుకు సంపాదక వర్గానికి, మహాసభ కార్యవర్గానికి హృదయపూర్వక కృతజ్ఞతలు. ముంబయిలాంటి నగరంలో ఒక్క తెలుగు పత్రిక కూడా లేదు. ఆ కొరతను దర్పణం తీరుస్తుందని భావిస్తున్నాను. క్రొత్తక్రొత్త శీర్షికలు పరిచయం చేసి పరిపూర్ణ పత్రికగా రూపొందించాలనీ నా కోరిక.

–మహేశ్వరం చంద్రశేఖర్.




www.bamsg.org
mahasabha@gmail.com
Tel.: 022-4144377-88, Tel. Fax: 022-24119832

# బిగిస్తే పిడికిలి...

యాపు 'రాంశం'



యాపురం వెంకటేశ్వర్
ప్రధాన కార్యదర్శి.

ముంబయి పరిసర ప్రాంతాల్లో దాదాపు 10 నుండి 12 లక్షల మంది తెలుగువారు ఉన్నట్లుగా అంచనా. సరైన సంఖ్య గురించి శాస్త్రీయ ఆధారాలు లేకపోయినప్పటికీ, ముంబయిలో ప్రతిచోట ఎవరో ఒక తెలుగువ్యక్తి మనకు తారసపడడాన్ని చూస్తే తప్పకుండా 10 లక్షలను మించే ఉండాలని అనిపిస్తుంది.

1960 కంటే ముందు ముంబయి, భీవండి, షోలాపూర్ లాంటి నగరాల నుండి మన తెలుగువారెందరో కార్పోరేటర్స్‌గా, ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా కూడా ఎన్నికయ్యారు. ఎంతో ఉన్నతపదవులు అలంకరించారు. తెలుగువారి గొప్పదనాన్ని చాటిచెప్పారు. కానీ 1960 నుండి తెలుగువారు రాజకీయంగా చాలా వెనుకబడిపోతున్నారు. ప్రస్తుతం భీవండి లో ఒక కార్పోరేటర్, జాల్నాలో ఒక ఎమ్మెల్యే మాత్రమే తెలుగు సమాజం నుండి ఎంపికయ్యా రు. ఇది ఎంతో ఆలోచించాల్సిన విషయం.

ఎందుకిలా జరుగుతోంది..? అని ఆలోచిస్తే రెండు కారణాలు కనిపిస్తాయి. మొదటి కారణం మనలో ఐక్యత లేకపోవడం అయితే రెండో కారణం మన తెలుగు నాయకులు ఇతర భాషీయులతో మమేకమై, సేవాకార్యక్రమాలు నిర్వహించి అందరికీ ఆమోదయోగ్యంగా ఎదగక పోవడం.. తెలుగు సంస్థలు, సంఘాలు తమవంతుగా విశేష సేవలందిస్తున్నప్పటికీ ఆ సేవల గురించి మిగతా ఇతర రాష్ట్రాల వారికి తెలియకపోవడం వల్ల మన తెలుగువారి మనుగడే ప్రశ్నార్థకమవుతోంది.

ఇలా జరగకుండా చూసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. మన తెలుగువారంటే స్థానిక మరాఠీయులకు ఎంతో అభిమానం. మనల్ని వారి కుటుంబ సభ్యుల్లా భావిస్తారు. మన తెలుగువారు కూడా మరాఠీ భాషా, సంస్కృతిలో మమేకం అయ్యారు. రాజకీయంగా ఎదిగేందుకు ఈ రెండు ఉదాహరణలు చాలు. కానీ, సిద్ధివినాయక మందిరం ట్రస్టీ ఏక్‌నాథ్ సంఘం లాంటి ఒకరిద్దరిని మినహాయిస్తే మన తెలుగు నాయకులు చొరవ చూపకపోవడం వల్ల నాయకులుగాచెప్పుకోదగ్గ స్థానాన్ని పొందలేకపోతున్నారు.

ఇది జరగాలంటే ముందు మనలో ఐకమత్యం పెరగాలి. ఐకమత్యం పెరగాలంటే సమాచారాల్ని ఇచ్చి పుచ్చుకోవాలి. భిన్నాభిప్రాయలున్న వారి మధ్య సమన్వయం పెంపొందాలి. సమన్వయ సాధన కోసం విరివిగా సమావేశాలు నిర్వహించాలి. కార్యక్రమాల్లో కలుసుకోవాలి. ఈ రకంగా పరస్పర కలయికతో భిన్నాభిప్రాయాల్ని ఏకాభిప్రాయంగా మార్చుకుంటే మనలో కూడా నాయకత్వ లక్షణాలు పెరిగి మనకున్న సంఖ్యతో కొన్నైనా కార్పోరేట్ సీట్లో, ఎమ్మెల్యే సీట్లో గెలుచుకోవచ్చు.

రాజకీయాలకు మహాసభ నిలయం కాకపోయినప్పటికీ, మేం నిర్వహించే కార్యక్రమాలకు తెలుగు ప్రముఖులు హాజరై తమ తమ సైద్ధాంతిక విభేదాలను తగ్గించుకోవచ్చు. మన ముంబయి తెలుగువారిలో ఎందరో పారిశ్రామికవేత్తలు, రాజకీయ కాంక్షలున్నవారు, ఉన్నతోద్యోగులు, మేధావులు, రచయితలు, ధనవంతులెందరో ఉన్నారు. వీరందరి శక్తిసామర్థ్యాల్ని వినియోగించుకుంటే తెలుగు వెలుగుల్ని అడ్డుకునేదెవరు..?

చిన్న చిన్న అంశాలకే తీవ్రంగా స్పందించే కలతలు పెంచుకోకుండా, ఒక గొప్ప లక్ష్యాన్ని ముందు పెట్టుకొని, అందరితో సమన్వయంగా ముందుకు సాగినప్పుడు తెలుగు వారిలో ఐక్యత అసాధ్యమేమీ కాదు. మన చరిత్ర స్వర్ణాక్షరాలతో లిఖించబడాలంటే, అన్నిరంగాలతో పాటు రాజకీయ రంగాల్లో ఎదిగినప్పుడే అది సాధ్యమవుతుంది. ఈ విషయాన్ని విజ్ఞులైన పెద్దలు గ్రహించి, 'సొంత లాభం కొంత మానుకొని, సమాజం కోసం పాటుపడితే చిరస్థాయిగా నిలిచిపోయే అవకాశం ఉంటుందని మనవి చేస్తున్నాను.

రండి.. మరి..! సంకోచం ఎందుకు..? కర్తవ్య దిశగా అడుగులు వేద్దాం..! కలిసి ముందుకు సాగుదాం..!!

❀❀❀



# PG

**INVESTMENT SHOP**

*Professional Insurance & Investment Consultant*

*Gangadhar Pillamarapu*

**Mo. 9004039150, 9322218929**

**E-mail : pginvestus@yahoo.com**

# I Can Help You!

## ☑ Select your Long time pending issues

- ☐ Your Insurance policy Lapsed/ Surrender/ Maturity/ Loan/ any Correction
- ☐ Any Mediclaim issues Cashless/ Reimbursement/ Portability
- ☐ Insurance for Two & Four Wheeler
- ☐ Looking for New Passport or Renewal for Assistance
- ☐ Income Tax Return Employee/ Business
- ☐ New Pan Card or Correction in Pan details etc.,
- ☐ Mutual Fund Redumption/ New Investment
- ☐ Change of Name to Gazette
- ☐ Make a Senior Citizen Card
- ☐ Any Others for your requirement :

- ❖ Just Pay Rs.6405/- Health Insurance Cover Rs.7 Lacs 2A + 2C
- ❖ Compulsary deductable Rs.3 Lacs, for age upto 60 yrs.
- ❖ LIC's New Plan JEEVAN ANAND, Jindagi Ke Saath Bhi.. Jindagi Ke Baad Bhi..
- ❖ Just Pay Rs.1292/- Rs.10 Lacs PA cover & more

జరిగిన కార్యక్రమాల

దర్పణం

తేది
22.06.2014
ఆదివారం
"వివాహవేదిక"



ముంబయిలో స్థిరపడ్డ తెలుగు కుటుంబాల్లో ఎదిగిన యువతీ యువకులకు పెళ్ళి సంబంధాలు కుదిర్చి ఈ పరాయి గడ్డపై తల్లిదండ్రులకు ఇతోదికంగా సేవలందించే సత్సంకల్పంతో మహాసభ మహిళాశాఖ అధ్వర్యంలో వివాహవేదిక నిర్వహించారు. ముంబయిలో ఉంటున్న తెలుగువారు కుల, ప్రాంత, వర్గాలకు అతీతంగా ఇందులో పాల్గొన్నారు.

తెలుగు భాషా వికాసాలతో పాటు, సాంస్కృతిక సంపదను కాపాడుకోవడానికి, సమాజిక బాధ్యతల్ని నిర్వహించేందుకే ఎందరో త్యాగధనులు మహాసభను స్థాపించారనీ, ఆ పరంపరనలో భాగంగానే వివాహవేదిక కార్యక్రమాన్ని సమయాసమయాల్లో నిర్వహిస్తున్నామనీ మహిళాశాఖ అధ్యక్షురాలు పద్మ రాజ్‌కుమార్ అన్నారు.

ఈ కార్యక్రమంలో ఆంధ్రమహాసభ అధ్యక్షులు సంకు సుధాకర్‌తో పాటు, సభ్యులు రాపెల్లి జ్ఞానేశ్వర్, మహిళాశాఖ ఉపాధ్యక్షులు తురగా జయశ్యామల, కార్యదర్శి యత్తం లత తదితరులు పాల్గొన్నారు.

---

జరిగిన కార్యక్రమాల

దర్పణం

తేది
12.07.2014
శనివారం
"ఎన్నీల ముచ్చట్లు"



కవులకు, ఎన్నీలకు అవినాభావ సంబంధం ఉంది. ఎన్నీల వెలుగులో కవులు తమ కలాలకు పదను పెడతారు. అందుకే ప్రతి పౌర్ణమినాడు ఆంధ్రమహాసభలో నిర్వహిస్తున్న కవుల సమ్మేళనం ఎన్నీల ముచ్చట్లకు రాన్రాను ఆదరణ పెరిగిపోతోంది.

ఈసారి నిర్వహించిన ఎన్నీల ముచ్చట్లు కార్యక్రమంలో మహాసభ అధ్యక్షులు సంకు సుధాకర్, ప్రధాన కార్యదర్శి యాపురం వెంకటేశ్వర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు సంకు సుధాకర్ మాట్లాడుతూ, మహాసభ తెలుగు సాహిత్యానికి పెద్దపీట వేస్తుందనీ, కవులను ప్రోత్సహించేందుకు, ఆదరించేందుకు ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉంటామనీ హామీ ఇచ్చారు.

ఈ ఎన్నీల ముచ్చట్లు కార్యక్రమంలో ప్రముఖ కథారచయిత అంబల్ల జనార్ధన్, నడిమెట్ల యెల్లప్ప, యెల్ది సుదర్శన్, యు.కే.మేఘ, కావలి రాములు, గుర్రపు కిషన్, గుర్రం బాలరాజు, జక్కని రాజారాం, భైరి నారాయణ, మార్గం రాజ్‌పాల్ తదితరులు పాల్గొన్నారు. అంతేగాక, ఎంతో ఆహ్లాదంగా సాగిన ఈ కార్యక్రమంలో సాహితీవిభాగ సంయుక్త కార్యదర్శి వేముల మనోహర్, సాంస్కృతిక విభాగ సంయుక్త కార్యదర్శి రాధామోహన్‌లు కూడా పాల్గొని కవులను ఉత్సాహపరిచారు.

జరిగిన కార్యక్రమాల దర్పణం

తేది
13.07.2014
ఆదివారం
ఉదయం 9.55 గం॥
నుండి 12.30 గం॥ వరకు
**"విద్యార్థులకు అవగాహన సదస్సు"**

# UPSC / MPSC
# యుపీఎస్‌సీ / ఎమ్‌పీఎస్‌సీ
## పై విద్యార్థులకు అవగాహన సదస్సు

దేశం అంటే ఒక చిత్రపటం కాదు.. కాన్వాస్‌పై గీసే గీత కాదు. దేశాన్ని ముందుకు తీసుకెళ్ళాలంటే సమర్థవంతమైన నాయకత్వంతో పాటు అంతకంటే సమర్థులైన ఉన్నత అధికారులు అవసరం. అత్యున్నత అధికారులే దేశప్రగతి మార్గాన్ని నిర్దేశిస్తారు. సమాజంలో సమతుల్యత పాటించేందుకు ప్రయత్నిస్తారు. సంఘంలో శాంతిభద్రతలు కాపాడేందుకు తమ ప్రాణాల్ని సైతం తృణప్రాయంగా భావిస్తారు. ప్రణాళికలు అమలు కావాలంటే కావాల్సిన పన్నుల్ని సక్రమంగా వసూలు చేసేందుకు నిరంతరం పాటుపడతారు.



ఈ పనులన్నీ సక్రమంగా చేయాలంటే ఆయా రంగాల్లో ఉన్నత విద్యతో సమాజం పట్ల సానుకూల దృక్పథం అవసరం. పిల్లల్ని ఉత్తమ పౌరులుగానే కాకుండా ఉత్తమ అధికారులుగా ఎలా తీర్చిదిద్దాలి అనే అంశంపై విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు ఒక కార్యక్రమాన్ని నిర్వహించింది.

పదవ తరగతి నుండి పోస్ట్ గ్రాడ్యుయేట్సు వరకు యువతీ యువకులు ఈ సెమినార్‌లో పాల్గొన్నారు. ఐయేఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, ఐఆర్ఎస్ లుగా మారాలంటే ఏం చేయాలి అనే అంశంపై ఈ సెమినార్‌ను నిర్వహించారు.

ముందుగా ప్రధాన కార్యదర్శి యాపురం వెంకటేశ్వర్ సభకు స్వాగతం పలికారు. తదనంతరం సాహిత్య విభాగ ఉపాధ్యక్షులు నడిమెట్ల యెల్లప్ప కార్యక్రమాన్ని కొనసాగించారు. అధ్యక్ష కార్యదర్శులతో పాటు ధర్మకర్తల మండలి చైర్మెన్ ఏక్‌నాథ్ సంగం, సంకల్ప్ ఐఏఎస్ ఫోరం ప్రతినిధులు సంతోశ్ రోకడే, సుకృత్ భూషణ్ తదితరులు జ్యోతిప్రజ్వలన కావించారు. సాంస్కృతిక శాఖ ఉపాధ్యక్షులు గట్టు నర్సయ్య ప్రార్థనా గీతాన్ని ఆలపించారు.

ఈ సందర్భంగా అధ్యక్షులు సంకు సుధాకర్ మాట్లాడుతూ, తెలుగు విద్యార్థులు వైద్య, సాంకేతిక రంగాల్లో ఎంతో ప్రావీణ్యత చూపిస్తున్నప్పటికీ పరిపాలనా విభాగం పట్ల అనాసక్తంగా ఉండడం విస్మయానికి గురిచేస్తుందనీ, మన తెలుగువారు ప్రభుత్వ పరిపాలనా యంత్రాంగంలో కూడా జెండా ఎగరవేయాలని ఆకాంక్షించారు. ప్రధాన కార్యదర్శి యాపురం వెంకటేశ్వర్ మాట్లాడుతూ, తెలుగు విద్యార్థులు ఐఏఎస్, ఐపీఎస్ రంగాల్లో రాణించాలంటే తల్లిదండ్రుల ప్రోత్సాహం అత్యవసరం అని, ఆంధ్రమహాసభ కూడా తనవంతుగా ప్రోత్సహించేందుకు సిద్ధంగా ఉందని అన్నారు.

సంకల్ప్ ఐఏఎస్ ఫోరం ప్రతినిధి సంతోశ్ రోకాడే గారు, ఐఎస్. ఐపీఎస్ కావాలనుకునే విద్యార్థులకు అవగాహన దిశగా ప్రసంగించారు. మార్గదర్శకాలను నిర్దేశించారు. దాదాపు 200 మంది విద్యార్థినీ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాశాఖ ఉపాధ్యక్షులు అనుమల్ల రమేశ్, సంయుక్త కార్యదర్శి యెలిగేటి రాజ్‌కుమార్, సాంస్కృతిక విభాగ సంయుక్త కార్యదర్శి రాధామోహన్, పీఆర్వో అల్లం నాగేశ్వరరావు, సభ్యులు డా॥గుజ్జేటి గంగాధర్, బడుగు విశ్వనాథ్, తాళ్ళ నరేశ్, రాంపెల్లి జ్ఞానేశ్వర్, కస్తూరి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. సాహిత్యవిభాగ సంయుక్త కార్యదర్శి వేముల మనోహర్ వందన సమర్పణ గావించారు.





❋❋❋

### శ్రీ లక్ష్మీనారాయణ చెట్టిగారి

# పదవీ విరమణ



ఆంధ్రమహాసభ అండ్ జింఖానాలో సుదీర్ఘకాలం పాటు (దాదాపు 16 సంవత్సరాలు) మేనేజర్‌గా సేవలందించిన లక్ష్మీనారాయణ చెట్టిగారు పదవీ వరమణ పొందారు. సుదూర ప్రాంతంలో నివసిస్తుండడం వల్ల, వయసు ముదిరిపోవడం వల్ల విధులు నిర్వహించలేక పోతున్నందుకు స్వచ్ఛందంగా పదవీ విరమణ పొందారు.

ఎంతో ఆత్మీయంగా మహాసభకు వచ్చే సభ్యులందరినీ పలకరిస్తూ, అందరితో కలివిడిగా ఉంటూ, అందరి నోళ్ళల్లో నాలుకగా ఉండే చెట్టిగారు పదవీ విరమణ పొందడంతో ఏర్పడ్డ ఖాళీని పూరించడం అంత తేలికేం కాదు. అయినా ఈ వృద్ధాప్యంలో ఆయన ముందు జీవితం కుటుంబ సభ్యుల మధ్య ఎంతో ఆహ్లాదంగా, హాయిగా, ప్రశాంతంగా సాగిపోవాలనీ, ఆయన నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో విలసిల్లాలనీ మహాసభ సభ్యులందరి తరపున ఆకాంక్షిస్తున్నాం.

30 జూన్ నాడు ఆయనకు వీడ్కోలు పలికేందుకు ధర్మకర్తల మండలి చైర్మెన్ ఏక్‌నాథ్ సంగం, కార్యదర్శి మంతెన రమేశ్, సభ్యులు కొత్తపెల్లి రమేశ్‌బాబు, పోతు రాజారాం తో పాటు మార్గం రాజ్‌పాల్ తదితరులు హాజరయ్యారు. ఇంకా, అధ్యక్షులు సంకు సుధాకర్, ప్రధాన కార్యదర్శి యాపురం వెంకటేశ్వర్, ఉపాధ్యక్షులు అనుమల్ల రమేశ్, సంయుక్త కార్యదర్శి యెలిగేట్ రాజ్‌కుమార్, సభ్యులు కటుకం గణేశ్, రాంపెల్లి జ్ఞానేశ్వర్, డా॥ గుజ్జేటి గంగాధర్, అల్లం నాగేశ్వరరావు తదితరులు చెట్టిగారికి ఘనంగా వీడ్కోలు పలికారు. అంతేగాకుండా ఆఫీస్ స్టాఫ్ అడ్డగట్ల మురళి, కే.నాగేశ్వర్‌రావు, సత్యం, తిరుపతి, గోవింద్, కృష్ణ తదితరులు కూడా లక్ష్మీనారాయణ చెట్టిగారికి హృదయపూర్వక వీడ్కోలు పలికి శుభాకాంక్షలందించారు.





## ఆంధ్ర మహాసభ లీజు



మన ఆంధ్రమహాసభ లీజు పొడిగించే విషయంలో మన ధర్మకర్తల కార్యదర్శి మంతెన రమేష్, మార్గం రాజ్‌పాల్ మరియు ప్రధాన కార్యధర్శి యాపురం వెంకటేశ్వర్ మరియు పరిపాలనశాఖ ఉపాధ్యక్షులు అనుమల్ల రమేశ్ గార్లు మునిసిపల్ అధికారి **DMC** శ్రీ సావంత్ గారిని కలిసి విన్నవించడం జరిగినాది



# లక్ష్మి జ్యెలర్స్

# LAXMI JEWELLERS

2430 1744
9870377535



మా వద్ద తెలుగు వారి అన్ని రకముల వెండి,
బంగారు నగలు విశ్వాస పూర్వకముగా 916 హాల్ మార్క్
తయారు చేసి ఇవ్వబడును, తయారు నగలు దొరుకును.
90 సంవత్సరాల నుండి ప్రసిద్ధి పొందిన నమ్మకమైన
ఇల్లందుల వారి దుకాణం



Advt.

Dealers in : 916 Hall Mark Gold, Silver & Fancy Ornaments

ప్రో. ఇల్లందుల సుదర్శన్

షాప్ నం. 4, పటేల్ మెన్షన్, ఖేడ్‌గల్లి,
సయాని రోడ్, ముంబయి- 400 025

Shop No. 4, Patel Mansion, Khedgally,
Sayani Road, Mumbai - 400 025

శ్రీ తాటికొండ మోతిరామ్ సహకారముతో


## తెలుగు విద్యార్థులకు శుభవార్త




పదవ, పన్నెండవ తరగతుల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఆంధ్రమహాసభ తరపున స్కాలర్‌షిప్ అందించాలని తీర్మానించాము. ముంబై కాస్మోపాలిటన్ నగరంగా అభివృద్ధి చెందినప్పటికి ముంబై నిర్మాతలైన తెలుగువారిలో ఎక్కువ శాతం మంది ఇంకా కార్మికులుగా కటిక పేదరికంలో మగ్గిపోతున్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో వారి పిల్లలు కూడా జీవితంలో ఎదగాలంటే విద్యార్హతలు తప్పనిసరిగా మారాలి. పేదరికంలో ఉంటూ కూడా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆర్థికంగా ఆదుకోవాలన్న సదుద్దేశ్యంతో **'స్కాలర్‌షిప్'** ఇవ్వాలని నిర్ణయించాము. అందుకు కావాల్సిన నియమనిబంధనలతో కూడిన ఫారం ఆంధ్రమహాసభ కార్యాలయంలో లభించగలదు. దాన్ని తీసుకొని అర్హతలు, ఆర్థికంగా అవసరం ఉన్న విద్యార్థులు ఆ ఫారం నింపి ఇవ్వగలరని మనవి. అర్హులైన విద్యార్థులకు శుక్రవారం, 15-08-2014 నాడు సభాముఖంగా స్కాలర్‌షిప్‌లు అందబడును. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకో గలరని మనవి.

## Felicitation to Meritorious Students on 15th August 2014

Students secured 70% and above in H.S.C. and 75% above in S.S.C.
are requested to submit a copy of their mark sheet on or before 10th August, 2014

***Scholarships for Needy Students***

The Bombay Andhra Mahasabha & Gymkhana is here by announcing Scholarships for S.S.C. & H.S.C. Students Passed during the year 2013-2014 on the basis of Merit cum Means

**For more details contact BAMS Office Staff**

ఆపాత మధురం...!

దర్పణం

# జయమ్ము నిశ్చయమ్ము...

- మర్రి జనార్ధన్

'యుద్ధంలో పాల్గొనడమే గొప్ప విషయం. దాని ముందు గెలుపోటములు చాలా స్వల్పాంశాలు..' అన్నాడు ఓ మహనీయుడు. గెలుపోటములను బేరీజు వేసుకుంటూ కాలయాపన చేసేవారికి విజయాన్ని సాధించడం కష్టసాధ్యమవుతుంది. గెలిస్తే బాధ్యతలు పెరిగినందుకు సంతోషించాలి. ఓడితే మరింత సమయం దక్కినందుకు ఇంకెంతో సంతోషించాలి. అందుకే గెలుపోటముల్ని సమానంగా స్వీకరించాలి.

ఆంధ్రమహాసభతో నాకు కూడా ఈ గెలుపోటముల మధుర స్మృతులు పెనవేసుకొని ఉన్నాయి. ఆ రోజుల్లో నేను రాజకీయంగా ఎంతోచురుకుగా ఉన్నాను. వర్లీ ప్రాంతం నుండి ఒక జాతీయ పార్టీకి నా వంతు సేవలందిస్తున్నాను. స్వతహాగా చొచ్చుకుపోయే స్వభావం ఉన్నందు వల్ల లక్ష్యాన్ని మాత్రమే టార్గెట్ పెట్టుకొని, మిగతా అనవసర అంశాలకు అంతగా ప్రాధాన్యత ఇచ్చేవాడిని కాదు.

ఆంధ్రమహాసభలో ఎన్నికలు ప్రకటించారు. నేను కేవలం జీవిత సభ్యున్ని మాత్రమే. అంతకు ముందు నేను ఏ కమిటీ ఎన్నికల్లో పాల్గొనలేదు. మహాసభలో పనిచేసిన అనుభవం కూడా లేదు. కానీ ఎందుకో నాకనిపించింది. ఈసారి తప్పకుండా ఎన్నికల్లో పోటీచేయాలనీ.. కానీ ఎలా..?

మనిషన్నవాడు గొప్పగానే ఆలోచించాలి. ఆలోచించడం వల్ల పోయేదేమీ లేదు కదా..! అధిరోహిస్తే ఎనుగు పీఠాన్నే అధిరోహించాలి అనే ఉద్దేశ్యంతో డైరెక్టుగా అధ్యక్షపదవికే పోటీ చేయాలనుకున్నాను. నా నిర్ణయాన్ని విని కొందరు శ్రేయోభిలాషులు అభినందిస్తే మరికొందరు పెదవి విరిచారు. కానీ నేను వెనక్కు పోలేదు. ఒకవేళ ఓడితే ఏమవుతుంది..? పోయేదేం లేదు కదా..! వస్తే కొండ.. లేకుంటే జుత్తు.. దానికోసం భయపడడం దేనికీ.? వెంటనే అధ్యక్ష పదవికి నామినేషన్ వేశాను. అనుమానం ఉన్నట్టే నేను ఓడిపోయాను. కానీ నా పెదవులపై చిర్నవ్వును పోగొట్టుకోలేదు.

ఓడిపోయినప్పటికీ, నాకు ఎందరో ప్రముఖులతో పరిచయం కలిగింది. ఓటమిని భరించే సహజత్వం అబ్బింది. ఆంధ్రమహాసభ ఎన్నికల వల్ల నా మానసిక సంకల్పం మరింతగా బలపడింది. అది నా ముందు జీవితానికి ఎంతో దొహదపడింది.

ఆ తర్వాత వరుసగా ఎన్నో సార్లు నేను ఆంధ్రమహాసభ ఎన్నికల్లో గెలిచి ఎన్నో పదవులు చేపట్టాను. అడ్మిన్‌గా నా సేవల్ని కొందరు మిత్రులు ఇప్పటికీ స్మరించుకోవడం నాకెంతో గర్వంగా ఉంటుంది.

మహాసభ మనకు మాతృమూర్తిలాంటింది. పాఠశాల లాంటిది. ఆ తల్లి ఒడిలో మంచి పాఠాలు నేర్చుకొని సమాజానికి అనువైన సేవలందిస్తే చరిత్రను నిర్మించుకుంటాం. లేకుంటే కాలగర్భంలో కలిసిపోతాం. అందుకే మిత్రులారా..! నేను చెప్పేది ఒకటే..! మహాసభ కార్యక్రమాల్లో విరివిగా పాల్గొనండి..! పరిచయాలు పెంచుకొండి. ఎన్నికల లక్ష్యంగా కాక, సామాజిక దృష్టిలో పెంచుకున్న పరిచయాలు ఎప్పుడో ఒకప్పుడు మీకు ఉపయోగపడతాయి.. మీరూ ఇతరులకు ఉపయోగపడతారు.

మహాసభలో నా ఓటమి పాఠం నాకు మున్ముందు ఎన్నో విజయాలకు దారితీసింది. కానీ ఇంకో పాఠం కూడా నేను నేర్చుకున్నాను. మనం ఏదైనా సాధించాలంటే ముందుగా మనం అంశం పట్ల మనకు పూర్తిగా అవగాహన ఉండాలి. అందులో పట్టు సాధించాలి. గుడ్డిగా పోయి అపజయం పాలై నిరాశలో మునిగిపోవడం అవివేకం. ఆ విలువైన సమయాన్ని మనం ఇతర పనులకోసం వెచ్చించవచ్చు.

ఏది ఏమైనా.. నేను చెప్పదలుచుకున్నది ఏంటంటే... యుద్ధం చేయండి..! ఓడినా, గెలిచిన మీరు యోద్ధులే..! విజయం అంటారా.? ఎప్పుడో ఒకప్పుడు మీకు చిక్కకుండా ఎక్కడికి పోతుంది..?

❀❀❀

**మనవి:** ఎనిమిది దశాబ్దాల చరిత్ర కలిగిన ఆంధ్రమహాసభతో ఎందరో సభ్యులకు ఎన్నో మధురానుభూతుల అనుబంధం పెనవేసుకొని ఉంది. అలాంటి అనుభూతుల్ని, అనుభవాల్ని మాకు రాసి పంపండి.. 'ఆపాతమధురం' శీర్షికలో ప్రచురిస్తాం.. ఆనాటి మీ సుమధుర జ్ఞాపకాలను మరోసారి నెమరువేసుకొండి.. అందరితో పంచుకొండి..!

# పట్టిన పట్టు విడవొద్దు

– జి.గంగాధర్





జీవితంలో ఇప్పుడున్న స్థితి నుంచి ఉన్నత స్థాయికి చేరుకునేందుకు అవసరమైన పాఠాలను వివిధ మార్గాల ద్వారా నేర్చుకుంటాం. పుస్తకాలు చదవడం ద్వారా, ఉన్నతమైన వ్యక్తుల జీవితాలను పరిశీలించడం ద్వారా ఈ పనులు చేస్తుంటాం. ఇవే కాకుండా మన చుట్టూ ఉండే చిరుప్రాణులు సైతం ఎంతో విలువైన విషయాలను మనకు నేర్పుతాయి.

చీమలు తాము వెళ్తున్న దారిలో ఏదైనా అడ్డంకి ఎదురైతే ఏం చేస్తాయి..? ఊహించని అవాంతరం ఎదురైందని అవి వెనక్కు వెళ్ళవు. వేలు పక్కనుంచే కొత్తదారిని ఏర్పరచుకుంటాయి. అవసరమైతే వేలుపైకి ఎగబాకి ముందుకు కదులుతాయి. దారి దొరికేదాకా ప్రయత్నిస్తూనే ఉంటాయి. మన జీవితంలోనూ ఎన్నో ఊహించని అడ్డంకులు, నివారించలేని ప్రమాదాలు ఎదురవుతుంటాయి. అంత మాత్రాన లక్ష్యాన్ని వదిలేసి పారిపోవాల్సిన అవసరం లేదు. గమ్యం చేరేందుకు నిరంతరం ప్రయత్నిస్తూనే ఉండాలి. 'పట్టిన పట్టు విడవొద్దు..' పట్టు విడిస్తే పని చేజారిపోతుంది. నిరాశ ఆవరిస్తుంది. సమయం వృధా అవుతుంది. జీవితంలో ఏమీ సాధించలేక పోయాననే అసంతృప్తి వేధిస్తుంది. మన లక్ష్యాన్ని చేరేందుకు ప్రత్యామ్నాయ మార్గాల కోసం అన్వేషణ కొనసాగిస్తూ ఉండాలి.

విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు, ఎదురుదెబ్బలు తగిలినప్పుడు, మనుషులు నిరాశ నిస్పృహల్లో కూరుకుపోతారు. తమ బతుకింతే అని చింతిస్తూ కూర్చుంటారు. ఇలాంటి సమయాల్లోనే చీమల పనివిధానాన్ని గుర్తుకు తెచ్చుకోవాలి. పరిస్థితులు ఎప్పటికీ ఇలాగే ఉండబోవని, మంచిరోజులు దగ్గర్లోనే ఉన్నాయనీ తెలుసుకోవాలి సానుకూల దృక్పథాన్ని అలవర్చుకోవాలి. అంతా మంచే జరగబోతుందనే ఆశావాదాన్ని మనసులో నింపుకోవాలి. చెడు కాలం శాశ్వతం కాదని ధైర్యం తెచ్చుకోవాలి... చీమ తనకంటే ఎక్కువ సంపాదించుకున్న చీమలను అసూయ చెందదు. వాటిపై ద్వేషాన్ని పెంచుకోదు. శక్తివంచన లేకుండా శ్రమించి, తనకు చేతనైనంత తిండిని సమకూర్చుకుంటుంది. ఇదొక గొప్ప పాఠం. మీరు చేయగలిగేంత శ్రమను, సంపూర్ణంగా చేస్తే, జీవితంలో సంతృప్తి లభిస్తుంది. ఉల్లాసంగా గడిపేందుకు తోడ్పడుతుంది. ఒక చీమ తన బరువుకంటే 20 రెట్ల ఎక్కువ బరువును సులువుగా మోస్తుంది. ఈ విషయంలో చీమ శక్తికంటే మన శక్తి తక్కువేం కాదు. మన శక్తిని తక్కువగా అంచనా వేసుకోవద్దు. ఈసారి మోయలేనంత బరువును మీ భుజాలపైకి ఎత్తుకున్నప్పుడు కుంగిపోవద్దు. చీమను గుర్తుకు తెచ్చుకొని స్ఫూర్తి పొందాలి.

మీ చుట్టూ ఉండేవారితో మంచి సంబంధాలు ఏర్పరచుకోండి. వారితో మంచిగా ఉండండి. మంచి స్నేహితులను సంపాదించుకోండి..చెడుకాలం ఎప్పటికీ ఉండకపోవచ్చు. సూర్యుడు అస్తమించినప్పుడు చీకటి ఆవరిస్తుంది. సూర్యోదయంతో వెలుగు ప్రసరిస్తుంది. అది ప్రకృతి ధర్మం. చెడు, మంచి కాలాలకు కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది.

❀❀❀




## శ్రద్ధాంజలి



ఆంధ్రమహాసభ జీవిత సభ్యులు, మహాసభకు ఎన్నో విలువైన సేవలందించిన గౌరవ సభ్యులు శ్రీ వై.వి.గోపాల శర్మ గారు తేది 8 మార్చి, 2014 నాడు పరమపదించారు.

ఆయన సేవలు మహాసభ ఎన్నడూ విస్మరించలేదని, ఆయన మహాసభ సభ్యుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారనీ తెలుపుతూ, వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సంతాపాన్ని తెలియచేస్తున్నాం.

– మహాసభ కార్యవర్గం.

WE CARE

**SINGLE PREMIUM AND GET MULTIPLE BENEFITS IN MEDICLAIM POLICY**




FOR INFORMATION:-
SPEAK TO POLICY EXPERT:-
Name: GANESH KUSUMA
Contact : 9029166128, 8879867086
EMAIL : KUSUMAGANESH@GMAIL.COM



SALIENT FEATURES:-

- **Eligibility: 90 Days to 60 years and above**
- Mediclaim Facility available from 3 months age to 90 years age without any medical checkup.
- All pre-existing diseases/ailment like BP, DM, HTN, Bypass, Knee Replacement, Angioplasty etc. covers once policy issue after 4 months.
- Maternity Benefits available after 9 months of policy issue.
- Cashless facility available all over India over 5500 Networked hospitals.
- **Single premium for 6 members in the family.**
- Mediclaim Policy from Government insurance company.


# శ్రీ నందుల రామకృష్ణ శర్మ

099490 02178
098484 12178

rknandula@gmail.com

Advt.

**ముంబాయి మహానగరములో గృహ ప్రవేశ, శ్రీ సత్యనారాయణస్వామి వ్రతము, నక్షత్ర, నవగ్రహ, జప, తర్పణ, దాన, హెూమ కార్యక్రమములు, వివాహ, ఉపనయనము, అపర కార్యక్రమములు, ఋగ్వేద, యజుర్వేధ ఆబ్ధీకములు, మాసికములు, సంవత్సరీకములు మరియు అన్ని పూజ కార్యక్రమలకు సంప్రదించ గలరు.**


A.V. NAGESWARA RAO
PRO - Shriram Chits (M) Ltd.
anr28@rediffmail.com
Mob.: 9029434560 / 9833434572
మీ విశ్వసనీయమైన ఆర్థిక
నేస్తం-నేటికీ, ఏనాటికీ!
శ్రీరామ్ చిట్స్
శ్రీరామ్ చిట్స్ (మహారాష్ట్ర) లిమిటెడ్,
418-419, బెజోలా కాంప్లెక్స్ సుమన్ నగర్ ఎదురుగా,
సియోన్-ట్రాంబే రోడ్, చెంబూర్ ఈస్ట్, ముంబయి-71.
ఫోన్ : +91 22 42680800-99
Shriram Chits
Empowering People Through Prosperity
• Chit Funds
• Deposits
• Life Insurance
• General Insurance
• Personal Loans
• S.M.E. Loans
• Loans Against property
• Gold Loan
• Loan For Gold Purchase
Shriram Chits (Maharashtra) Ltd.,
418-419, Bezzola Complex,Opp. Suman Nagar,
Sion-Trombay Road,Chembur (E), Mumbai - 400 071
Tel.: 42680800 - 99 Fax: 42680822
Advt.

# మీకు తెలుసు కదా..!

మహాసభ అంటే కేవలం మనోరంజక కార్యక్రమాలు, కాలక్షేపాలే కావనీ, తెలుగు సాహితీ సంస్కృతులు పరిరక్షణ కేంద్రమనీ, తెలుగు ఐక్యతకు ప్రతీక అని **మీకు తెలుసు కదా..!** అంతేకాదండీ..! ఇంకా ఉన్నాయి..

## మీ భక్తి ప్రవృత్తుల కోసం..



మహాసభ ప్రాంగణంలోనే శ్రీ వెంకటేశ్వర దేవాలయం ఉంది. నిత్యపూజలతో కళకళలాడే ఆ స్వామివారిని దర్శించుకుంటే ఏ ఆపదలు రావనీ, ఆపదమొక్కుల వాడి ఆశీస్సులు అందరికీ అందుతాయనీ **మీకు తెలుసు కదా..!** అయితే ఇంకేం..? రండి..! సకుటుంబ సపరివారంగా మహాసభలో కొలువై ఉన్న ఏడుకొండలవాడిని దర్శించుకుని పాపపరిహారం పొందడమే కాకుండా మోక్షమార్గాన్ని సులభతరం చేసుకొండి..!

## మీ పిల్లల కొరకు స్కేటింగ్ కోచింగ్



**'ఆరోగ్యమే మహాభాగ్యం'** అన్నారు పెద్దలు..మరి ఆరోగ్యం బాగుండాలంటే దేహం చురుకుగా ఉండాలి. దేహం చురుకుగా ఉంగాలంటే ప్రతి అవయవం వేగంగా కదలాలి. అందుకే ఆంధ్రమహాసభలో స్కేటింగ్‌ను ప్రవేశపెడుతున్నాం. అయితే ఇందుకోసం కొంత ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. మహాసభ జీవిత సభ్యులకు ఈ ఫీజు ప్రతి వ్యక్తి రూ॥లు 350/-, జీవిత సభ్యులు కాని వారికి రూ॥ 850/- ప్రతి నెల చెల్లించాల్సి ఉంటుంది. ప్రతి బుధ, శుక్రవారం నాడు సాయంత్రం 5 గం॥ నుండి 8 గం॥ వరకు స్కేటింగ్‌లో శిక్షణ ఇవ్వబడుతుంది. ఇవన్నీ **మీకు తెలుసు కదా..!**

## మీ పిల్లల కొరకు వాలీబాల్ కోచింగ్



ఆంధ్రమహాసభ ఆవరణలో శ్రీ వేణుగోపాలు గారి ఆధ్వర్యములో మన సభా సభ్యులకు ఉచితముగా వాలీబాల్ ఆటలను నేర్పగలరు. తేది 16.07.2014 నుండి తేది 26.07.2014 వరకు ఉదయం 7.00 గంటల నుండి 8.30 గంటల వరకు మరియు సాయంత్రము 6.30 గంటల నుండి 8.30 గంటల వరకు ఉండును. కావున సభ్యులందరు ఈ సదవకాశాన్ని తమ పిల్లలకు ఉపయోగించుకో గలరు.

## మీ విజ్ఞానం కోసం..



**పుస్తకం హస్త భూషణం** అన్నారు కదండీ..! అంతేకాదు.. పుస్తకాలు లేని ఇల్లు స్మశానంతో సమానమని కూడా అన్నారు. పుస్తకం మనిషి మస్తిష్కానికి ఎరువులాంటిది. అలాంటి విజ్ఞానజ్యోతుల్ని వెలిగించి పెంచే దాదాపు 8 వేల అమూల్యమైన గ్రంథాలెన్నో ఆంధ్రమహాసభలోని శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు గ్రంథాలయంలో మీ కోసం ఎదురుచూస్తున్నాయనీ **మీకు తెలుసు కదా..!**

## మీ సంస్కృతి కోసం..



కళలు మన సంస్కృతికి తాళపు చెవులు. కళలు ఒక జాతికి ధృవీకరణ పత్రాలు. నాట్యం, గానం, సంగీతం, సాహిత్యం అన్నీ కూడా మనిషిలోని చీకటి తెరల్ని తొలగించి, వెలుగు కిరణాలకు స్వాగతం పలికే దీపదారులు. మహాసభలో వివిధ నాట్య రీతుల్ని నేర్పించే తరగతులు నిర్వహిస్తున్న విషయం **మీకు తెలుసు కదా..!**

వీటితోపాటు ప్రతి నెలా విజ్ఞానపరం, వినోద, ధార్మిక కార్యక్రమాలు, ఆరోగ్యశిబిరాలు, కౌన్సిలింగ్ ప్రోగ్రాములు రెగ్యులర్‌గా జరుగుతాయి. దర్పణంలో కార్యక్రమాల వివరాలు తెలుసుకొండి.. రండి..! ఆంధ్రమహాసభ మనది.. మనందరిది..! కార్యక్రమాల్ని విజయవంతం చేద్దాం..! మన స్వాభిమానాన్ని పెంచుకొందాం..!! ఇది **మీకు తెలుసు కదా...!!**

## సభ్యులకు సవినయ విన్నపం

ఆంధ్రమహాసభ మహారాష్ట్ర తెలుగువారందరికీ ఆరాధనాకేంద్రంగా ఉన్న విషయం అందరికీ తెలిసిందే.. అంతేగాక, తెలుగు సంస్థలన్నింటికీ మాతృసంస్థగా పేరుపొందింది కూడా.. అందుకే మహాసభలో జరిగే కార్యక్రమాల గురించి కానీ, కార్యకలాపాల గురించి కానీ సభ్యులైనవారు, సభ్యులుకానీ వారు కూడా ఎంతో ఆసక్తిగా చర్చించుకుంటారు. మహాసభ తెలుగువారి మానసపుత్రిక కావున ప్రతివారికి ఈ మహాసభ పట్ల ఎంతో గౌరవాభిమానాలు ఉన్నాయి.

అయితే మహాసభ గురించి ఎవరు, ఎక్కడ మాట్లాడినా, చర్చించినా మహాసభ గౌరవప్రతిష్టలకు భంగం వాటిల్లకుండా జాగ్రత్త పడాల్సిన కర్తవ్యం అందరిపైన ఉంది.

**మా మనవి ఏమనగా...**

మహాసభ గురించి ఎవరైన సలహాలు, సూచనలు ఇవ్వాలనుకున్నా, మహాసభ గురించి అభిప్రాయాలు వెల్లడించాలనుకున్నా దయచేసి ప్రధాన కార్యదర్శిపేరు మీద నేరుగా మహాసభ కార్యాలయానికే రాతపూర్వకంగా ఇవ్వాలనీ, వీధుల్లో, చౌరస్తాల్లో మహాసభ గురించి అనవసరమైన అధిక ప్రసంగం చేయడం భావ్యం కాదని విన్నవించుకుంటున్నాం.

అంతేగాకండా, సోషల్‌మీడియాల్లో అంటే వాట్సప్‌లో కానీ, మెయిల్స్‌లో కానీ, ఫేస్‌బుక్‌లాంటివాటిలో కానీ మహాసభ గురించి విమర్శనాత్మకమైన చర్చలు చేయొద్దనీ, దీనివల్ల మనందరికి ప్రియమైన మహాసభను కించపరిచినట్లవుతుందని తెలియచేస్తున్నాం. మీరు రాతపూర్వకంగా ఇచ్చిన వాటిపై మేం కమిటీ మీటింగ్‌లో చర్చించి అవసరమనిపిస్తే మేం తీసుకోబోయే చర్యల గురించి రాతపూర్వకంగానే తెలియచేస్తాం. ఇది అందరికీ గౌరవంగా ఉంటుందని మరొక్కసారి మనవి చేస్తున్నాం.

మహాసభలో ఎన్నో సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉంది. అందుకోసం అధికారికంగా మేం ప్రయత్నిస్తాం. మీ సలహాలు, అభిప్రాయాలు మాకు ఎంతో అమూల్యం. వాటిని బహిరంగంగా చర్చించి సొంతకీర్తికోసమో, చవక ప్రచారం కోసమో వినియోగించకుండా నేరుగా మహాసభనే సంప్రదించాలనీ కోరుతూ..

మా మనవిని మన్నించి సభ ప్రతిష్టను పెంచేందుకు సహకరిస్తారనీ ఆశిస్తున్నాం.

**సంకు సుధాకర్,**
అధ్యక్షులు

**యాపురం వేంకటేశ్వర్**
ప్రధాన కార్యదర్శి

మహాసభ ముఖపత్రిక దర్పణంను ప్రతినెలా మీకు రెగ్యు లర్‌గా అందించేందుకు మేం కట్టుబడి ఉన్నాం. సమచారంతో పాటు విలువైన సాహిత్యాన్ని అందించే విధంగా దాన్ని తీర్చిదిద్దుతున్నాం. అయితే ఇది చాలా ఖరీదైన వ్యవహారం గనక, మీరు, మీ పరిచయ స్తులు దర్పణం కోసం ప్రకటనలు ఇవ్వాలనీ మనవి చేస్తున్నాం.

దీంతో మీకు తగిన గుర్తింపు లభించడమే కాకుండా, మహాసభకు మీ వంతు సేవలందించిన వారవుతారు. అంతేగాక, ప్రకటనల్ని ఇప్పించిన వారికి దర్పణంలో రాతపూర్వకంగా కృతజ్ఞతలు కూడా తెలుపుతామని మనవి చేస్తున్నాం.

## సభ్యులకు మనవి

- మీ చిరునామాగానీ, ఫోన్ నంబర్‌గానీ మారితే వెంటనే మాకు రాసి పంపండి.
- దర్పణంలో ప్రచురణార్థం కవితలు, జోక్స్, వింతలు విశేషాలు, చిన్న చిన్న కథలు, వ్యాసాలు రాసి పంపండి. ప్రచురణకు అర్హమైన వాటిని అవసరం వస్తే చిన్నచిన్న మార్పులు చేసి ప్రచురిస్తాం.
- సభ్యులు ఏదైనా సామాజిక, సాంస్కృతిక, సాహితీ, క్రీడా, విద్యా లాంటి రంగాల్లో ఏదైన అవార్డులు, రివార్డులు పొందినట్లయతే మాకు తెలపండి. వీలైతే అందుకు సంబంధించిన ఫోటో కూడా పంపండి. ప్రచురిస్తాం.
- రచనలు తమ స్వంతమనీ హామీ పత్రం జతచేయండి.
- ప్రచురణ విషయంలో సంపాదక వర్గానిదే తుది నిర్ణయం. వాదోపవాదాలకు తావులేదు.
- పెళ్ళి రోజులు, పుట్టిన రోజుల గురించి ముందుగా తెలపండి..ఉచితంగా ప్రచురిస్తాం.
- సభ్యులకు చెందిన సంతాప వార్తలు కూడా ప్రచురిస్తాం.

***ఈ దర్పణం ఆంధ్రమహాసభ సభ్యుల మనోదర్పణానికి దర్పణం కావాలన్నదే మా ఆశయం.***

సాహితీ దర్పణం

## నాటు తుపాకి

– అలిశెట్టి ప్రభాకర్

డబ్బులో నాని నాని
ఉబ్బిపొయ్యే
అవకాశవాద శవాల్లారా..
పదవుల కుర్చీల్ని పట్టుకు వేళ్ళాడే
గబ్బిలపు ముఖాల్లారా
నా బాధ మీది కాదు

కులాల పుళ్ళపై కుళ్ళ బొడుస్తున్న
రాజకీయ కుతంత్రమా..
శ్మశానంలో
శాంతి దీపాలు వెలిగించే
ప్రజాస్వామ్య ప్రభుత్వమా
జ్ఞానోదయ కిరణాలు సోకని
పురవీధుల గుండా తరిలి వెళ్తొన్న
బుద్ధవిగ్రహ మహోత్సవమా
నా బెంగ మీ గురించి కాదు
ఆంధ్రదేశపు
ఆశయాల షామియానాకి
ఆకలి చావుల తోరణాలు కట్టి
అదిలాబాదడవుల్లో
శాంతి భద్రతల్ని జో'కొట్టి'న
ఖరీదైన కాషాయమా...
అగ్రరాజ్యాల అప్పుని
గోవర్ధన పర్వతంలా
చిటికెన వేలి పైకెత్తి
గోర్బ'చెవ్'లో గుసగుసలాడిన
అందమైన రాజీవుడా
నా బెంగ మీ వల్లా కాదు...
నా బాధల్లా
బెంగల్లా...
దిగులల్లా..
ఎంతకీ పేలని
నాటు తుపాకి లాంటి
సగటు మనిషి గురించీ...
మందని మందుగుండు వంటి
వాని గుండె గురించీ...

❋❋❋

## సాహితీ ప్రియులకు శుభవార్త



ముంబయిలోని తెలుగు భాషాభిమానులకు, సాహితీవేత్తలకు, కవులకు, రచయితలకు ఒక శుభవార్త.

ప్రతి పౌర్ణమినాడు 'ఎన్నీల ముచ్చట్ల' పేరుతో ఆంధ్ర మహాసభ ప్రాంగణంలో ఒక సాహితీకార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నాం. ఇంతవరకు మూడు కార్యక్రమాలు నిర్వహించాం. మున్ముందు ఈ ఎన్నీల ముచ్చట్లను మరింత జనరంజకంగా, కవితామయంగా నిర్వహించాలని తలపెట్టాం.

ప్రతి సాహిత్యాభిమాని ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయడమే కాకుండా ముంబయిలో తెలుగు భాషావికాసానికి ఆంధ్రమహాసభ చేస్తున్న కృషికి చేయూత నివ్వాలని కోరుతున్నాం.

ఈ కార్యక్రమంలో పలు సాహితీఅంశాలపై స్పందించే అవకాశాన్ని సద్వినయోగపరుచుకోవాలని మా మనవి.

## ఒక మనవి

ఆంధ్రమహాసభ సభ్యులందరికీ సరికొత్తగా గుర్తింపు కార్డులు ఇవ్వాలని సంకల్పించాం. కావున సభ్యులందరు ఈ క్రింద ఇచ్చిన కూపన్‌లో తమ వివరాలన్నీ స్పష్టంగా ఇంగ్లీష్ భాష లో పెద్ద అక్షరాల్లో పూర్తి చేసి పంపించాలనీ మనవి. వీలైతే ఇదే కూపన్‌ను కట్ చేసి, లేకుంటే ఈ వివరాలన్నీ తెల్లకాగితంపై వివ రంగా రాసి మహాసభ కార్యాలయానికి అందచేయాలనీ మనవి.

పేరు:------------------------------

పుట్టిన తేది:--------రక్తపు గ్రూపు:------------

చిరునామా:----------------------------

ఫోన్ / సెల్‌నం:------------------------

మెయిల్:------------------------------

పీజీ/ ఎల్‌జీ/ ఎల్‌ఎల్ క్రమసంఖ్య-----

**తాజా ఫోటో ఒకటి జతచేయగలరు.**

# శ్రీ నందుల రామకృష్ణ శర్మ

099490 02178
098484 12178

rknandula@gmail.com

Advt.

**ముంబాయి మహానగరములో గృహ ప్రవేశ, శ్రీ సత్యనారాయణస్వామి వ్రతము, నక్షత్ర, నవగ్రహ, జప, తర్పణ, దాన, హోమ కార్యక్రమములు, వివాహ, ఉపనయనము, అపర కార్యక్రమములు, ఋగ్వేద, యజుర్వేధ ఆబ్దీకములు, మాసికములు, సంవత్సరీకములు మరియు అన్ని పూజ కార్యక్రమలకు సంప్రదించ గలరు.**



- సంగెవేని రవీంద్ర

ప్రత్యేక వ్యాసం

దర్పణం

# శ్రమైక జీవన సౌందర్యాధినేత..

# చేనేత..!



**ప్రపంచ మానవాళికి అత్యవసరమైన వాటిలో అత్యధిక ప్రాధాన్యత కలిగినవి రోటీ ఔర్ కప్డా.. అనుకుంటే భూమంతా మన మకానే..! కానీ రోటీ ఔర్ కప్డా లేకుండా మనిషి తన మనుగడను సాగించలేడు. నగర నేపథ్యంలో ఉన్న మనం అన్నాన్ని సృష్టించే అభినవ దేవుళ్ళు రైతుల గురించి ఎంత రాసినా తక్కువే. అన్నదాతల బతుకులు అన్నలు, బాబులు, బాబాలు, దొరలు, సింహాలు, మోదీలు ఎవ్వరు కూడా బాగుచేయలేకపోతున్నారు. భూమిని నమ్ముకున్న పాపానికి నరకాన్ని చవిచూస్తున్నారు. ఆ అన్నదాతలకు జేజేలు.**

అన్నదాతల తర్వాత అంతటి దుర్భర జీవితాలను మోస్తున్న వారు నేతన్నలు. చేనేత కార్మికుల ఛిద్రజీవితాలను, దుర్భర బడుగు బ్రతుకులను ఎందరో కవులు తమ కవితల ద్వారా కన్నులకు కట్టినట్లుగా పరిచయం చేశారు.

చేనేత వృత్తి వారసత్వ కులవృత్తుల్లో ఒక ప్రధాన అంశం. పశ్చిమ దేశాల్లో కూడా ప్రాచీనకాలం నుండే విశేష ప్రాచుర్యం పొందిన గృహ సంబంధిత వృత్తులలో చేనేతకు పెద్దపీట వేశారు. ఆరాధించారు. శ్రమైక జీవన సౌందర్యం, కళాత్మక హృదయంతో కూడిన వృత్తినైపుణ్యం, సహృదయ సేవాతత్పరత లాంటి విశిష్టలక్షణాలు చేనేత కులాలవారిలో పురాణకాలం నుండే ఉన్నాయి. మనదేశంలో చేనేత కులస్థులను వివిధ ప్రాంతాల్లో వివిధ పేర్లతో పిలుస్తారు. మన తెలుగు రాష్ట్రాల్లో వీరిని 'సాలెవారు' అని అంటారు.

చేనేత కులాల్లో పద్దెనిమిది దాకా ఉపకులాలు (వర్గాలు) ఉన్నాయి. వీటిలో తొగటవీర క్షత్రియులు, దేవాంగులు, పద్మశాలీలు, పట్టుశాలీలు, కుర్నిశాలీలు, స్వకుల సాలీలు వంటి ఉపవర్గాలు ప్రధానంగాను, సర్వసాధారణంగాను అందరికీ తెలిసినవిగా ఉన్నాయి. వీరందరి కులవృత్తి చేనేతపని. ప్రధాన ఉపకరణం మగ్గం. కానీ, వీరి సాంస్కృతిక సంప్రదాయాలు, దేవతారాధనలు, మూలపురుషులు, కులదేవతలు వేర్వేరుగా ఉంటాయి.

చేనేత కులస్థులలో దేవాంగులకు దేవల మహర్షి మూలపురుషుడైతే, స్వకుల సాలెవర్గం వారికి జిహ్వేశ్వరుడు మూల పురుషుడుగా భావిస్తారు. స్వకుల సాలీల కులదేవత అంబాభవాని. తుల్జాభవాని దేవిని వీరు ఆరాధిస్తారు. పద్మశాలీలు బ్రహ్మమానసపుత్రుడైన భావనారుషిని ఆరాధిస్తారు. పురాణ ప్రసిద్ధ మహర్షి, చిరంజీవి అయిన మార్కండేయుడు వీరి మూల పురుషుడు. తొగట వీర క్షత్రియులకు కులదేవత నందవరం చౌడేశ్వరిదేవి అయితే, దేవాంగులకు శ్రీరామలింగ చౌడేశ్వరిదేవి. పూజా సంప్రదాయాల్లో తొగటులు జంతుబలులిస్తారు. దేవాంగులు శాకాహార నైవేద్యాలు పెడతారు.

చేనేత కులాల్లో పద్మశాలీల మూలపురుషుడు భావనారుషి. శతావధాని బ్రహ్మశ్రీ గడియారం వేంకటశేషశాస్త్రి వ్యాసప్రోక్తమైన భావనర్షి పురాణ పరిష్కర్త. పురాణగాథ ప్రకారం సృష్టి ఆరంభంలో ప్రాణికోటి నగ్నత్వ నివారణోపాయంగా బ్రహ్మ భావనలో పుట్టిన దివ్యపురుషుడు భావనారుషి. మార్కండేయ మహర్షి నిర్వహించిన యాగంలో ఉద్భవించి, లోకంలో వస్త్రనిర్మాణం చేయడానికి జన్మించిన దివ్యాంశసంభూతుడు భావనారుషి.

శ్రీమహావిష్ణువు నుండి పద్మమృణాళులు, తామరతూడులు, మహాశివుడి నుండి శాంభవీవిద్యా ప్రభావంతో భావనారుషి రంగురంగుల వస్త్రాలు తయారు చేశాడు. అంతేగాక, తాను నేసిన వస్త్రాల నుండి పీతాంబరాన్ని, గరుడ ధ్వజవస్త్రాన్ని విష్ణువుకు, లక్ష్మీనివాసాన్ని శ్రీమహాలక్ష్మికి, రాంకవాన్ని బ్రహ్మదేవునికి, పౌషికాన్ని సరస్వతిదేవికి అందించి, దేవతలకు బట్టలు అందించిన మహనీయతను పొందాడు.

# దేశభక్తి అంటే...

- రావి రంగారావు
సెల్ నం: 092475 81825

సాహితీ దర్పణం

చెట్టుని
వదిలిపోయిన ఆకులు
తిరిగి
చెట్టు మొదటికి
చేరడం దేశభక్తి...


మబ్బుల స్విస్ బ్యాంక్‌కు
తరలించిన సంపద
తిరిగి
భూమికి సమర్పించుకోవటం
దేశభక్తి

మనకు
పరిపూర్ణ వ్యక్తిత్వం ప్రసాదించిన
మాతృభాషను
మాటలతో చేతలతో గౌరవించడం
దేశభక్తి...

జాతీయ జెండాను
అమ్మ ప్రాణంగా భావించి
నిరంతరం
కాపాడుతూ ఉండడం దేశభక్తి

విడిపోయిన నిప్పు కణికల్ని
ఒకచోట చేర్చి
మహాజ్వాలగా మార్చి మురికిని
తగలెయ్యటం దేశభక్తి...

❀❀❀



భావనారుషి భార్య సూర్యపుత్రిక భద్రావతికి జన్మించిన నూటొక్క కుమారులు కూడా వస్త్ర నిర్మాతలే...

భావనా మహర్షి తన తపోబలంతో కాళువా సైనికుడు అనే రాక్షసుడ్ని సంహరిస్తాడు. రాక్షస గణాలను జంతు, వృక్ష, జీవులుగా, క్రిమికీటకాలుగా మార్చి పట్టు పురుగులుగా, ప్రత్తిమొక్కలుగా చేసి వాటి నుండి దారాలను తీసి వివిధ రకాలైన వస్త్రాలను రూపొందించాడు. భావనారుషికి, క్రతూద్భవ, పద్మ కోశీయార్య, శార్దూలబృందశైలేశ, పుండరీకగతిధ్వజ, జగద్వాసో మూలహేతు, హరనాభిసరోజాత తంతుసంతానకౌశల, దివ్యమహాంబర విధాయక..' లాంటి పదిపేర్లున్నాయి.

శ్రీవేంకటేశ్వరస్వామి దేవేరి పద్మావతి పద్మశాలీల ఆడపడుచుగా చెప్పుకుంటారు. అలివేలు మంగమ్మకు, ప్రత్యేకదినాల్లో నారాయణ వనం శ్రీకళ్యాన వేంకటేశ్వరస్వామికి ఇప్పటికీ పద్మశాలీలే పట్టువస్త్రాలు సమర్పిస్తారు. ఆహోబిలం, మంగళగిరి లాంటి పుణ్యక్షేత్రాలలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో, కళ్యాణోత్సవాలలో కన్యాదాతలుగా, ఆడపడుచుల లాంఛనాలు సమర్పించేవాళ్ళుగా పద్మశాలీలే వుంటారు. చేనేత కులాల్లో పద్మశాలీలకు విశేషమైన స్థానం ఉంది.

చేనేత కులాల్లో మరో ప్రముఖ వర్గం దేవాంగులు. వీరికి మూలపురుషుడు దేవల మహర్షి, సృష్టిని నిర్మించిన బ్రహ్మ, వస్త్రాన్ని సృష్టించలేక ఆందోళనలో ఉన్నప్పుడు, ఈశ్వరుడి నుండి జన్మించిన వాడే దేవలుడు.

శ్రీమహావిష్ణువు నాభినుండి వేదాలతో పాటు జన్మించిన దారాలను తీసుకొని బట్టలుగా తయారు చేయాలనీ శివుడి నుండి ఆజ్ఞను పొందాడు. బట్టలు నేసేందుకు కావాల్సిన పరికరాలను

మేరు పర్వత ప్రాంతంలోని మయుడి నుండి గ్రహిస్తాడు. ఆమోదపురాన్ని రాజధానిగా చేసుకొని దేవలుడు పరిపాలన కొనసాగించాడు. ఆదిశేషుడి కుమార్తె చంద్రలేఖను, సూర్యుడి సోదరి దేవదత్తను దేవాంగుడు పెళ్ళాడాడు. దేవలుడికి విమలాంగుడు, ధవళాంగుడు, దివ్యాంగుడు అనే ముగ్గురు కొడుకులు. వీరంతా వస్త్రకారులే. దేవతల అంగాలను కూడా కప్పిపుచ్చే వస్త్రాలను నిర్మించిన వాడు గనక ఇతడ్ని దేవాంగుడు అంటారు.

అగస్త్య మహర్షి వాతాపి, ఇల్వలను చంపిన తర్వాత బ్రహ్మణులకు మాంసభోజనం నిషిద్ధమైన ఒక పురాణగాథతో దేవాంగులకు సంబంధం ఉందని కొందరు విశ్వసిస్తారు. బహుశ అందువల్లే కావొచ్చు... చేనేత కులస్తుల్లో శుద్ధబ్రహ్మణతత్వమగు సాత్వికత, యజ్ఞోపవీత ధారణ, వేదాలను పఠించుట లాంటి వైదికాచార లక్షణాలు కనిపిస్తాయి. దేవాంగుల సంఖ్య గుంటూరులోని చీరాలలో ఎక్కువగా ఉంటుంది.

ఇహపోతే చేనేత కులాల్లో 'స్వకుల సాలె' వర్గం వారు ప్రధానంగా మహారాష్ట్రకు చెందినవారుగా చెబుతారు. ఆంధ్ర, కర్ణాటక, గుజరాత్‌లో కూడా వీరి సంఖ్య ఎక్కువగానే ఉందని గణాంకాలు తెలియచేస్తున్నాయి. మహారాష్ట్రకు చెందిన సంత్ భానుదాస్ ఖడమ్‌కర్ రాసిన 'మూలస్తంభసాలి మహాత్మ పురాణ్' అనే మరాఠీగ్రంథంలో, ఇతర కొన్ని పుస్తకాల్లో కూడా వీరి వివరాలు చాలా ఉన్నట్లు చరిత్రకారులు చెబుతున్నారు. స్వకుల సాలె వారి మూల పురుషుడు జిహ్వేశ్వరుడు. శివుడి నాలుక నుండి పుట్టినందు వల్ల ఇతడికి 'జిహ్వేశ్వరుడు' అనే పేరొచ్చింది.

ఆదిశక్తి ఆశీస్సులతో జిహ్వేశ్వరుడు వస్త్రనిర్మాణం చేపట్టాడు. ఇతడికి అంకిని, దశాంకిని అనే ఇద్దరు భార్యలు. వీరికి పది మంది కుమారులు. అంతా చేనేత నిపుణులే.. జిహ్వేశ్వరుడు దేవతలందరికీ బట్టలు తయారు చేసివ్వడమే కాకుండా ఓ సందర్భంలో దేవతల సేనాధిపతిగా కూడా విధులు నిర్వహించి మనబలుడు అనే రాక్షసుడ్ని సంహరించాడు. అందుకే జిహ్వేశ్వరుడి చిత్రపటాల్లో వేదం, మగ్గం లతో పాటు ధనుస్సు, అంబులపొది కూడా ఉంటాయి.

చేనేత వర్గీయులు ఉపయోగించే మగ్గంలోని పరికరాలన్నీ దేవతల మారురూపాలే అని చెబుతారు.

మగ్గంలో బ్రహ్మ 'టూన్'గా, విష్ణువు 'అట్సర్'గా, శివుడు 'హత్తా'గా రూపొందారని చెబుతారు. ఈ మూడింటికి మేలుబంతిగా ఉంగే 'పాజాని' స్వయంగా ఆదిమాయే...! 'టూన్' ను తిప్పే కట్టెవంటి 'గూడ్' ఇంద్రుడు, 'కుంట్యా' మయుడు, హత్తాకు ఇరువైపులా వుండే 'ఖిలాలు' గంగ, సరస్వతి దేవతలు. జయ విజయులు 'ధేల్‌జ్యా'లుగా, సహ్యాద్రి, శేషాద్రి పర్వతాలు

# రెప్పచాటు ఉప్పెన

- ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్
సెల్: 098490 82693

సాహితీ దర్పణం

యూనివర్శిటీ చెట్లన్నీ
దుఃఖితనేత్రాలై కదులుతున్నాయి
క్యాంపస్ ఆవరణ
మౌన యాతనలో
విధ్వంస మరణాలని లెక్కిస్తుంది
నిత్యం కొనసాగిన చర్చ
అంతిమ చిత్రాన్ని
నల్లబల్ల తెల్లగా విప్పిచెప్పింది
పచ్చిపులుసుకు సైతం
నోచుకోని పల్లె విద్యార్థులు
యూనివర్శిటీ దారుల్లో
రాలిన ఆకులై
చరిత్రగా మొలకెత్తారు...

+++

గ్లోబలైజేషన్ గొడ్డలి దెబ్బకు
పల్లె చేతుల్లోని సత్తు కంచం
కారం మెతుకులు మట్టిపాలయ్యాయి
భూమిని సింగారించిన బురద కాళ్ళు
ఇనుప చెట్ల వేళ్ళకు ఉరివేసుకున్నాయి...

+++

వెన్నెముకను కోల్పోయిన
పొలాల అవమానాలను
పుస్తకాలు తమలోకి
వంపుకుంటుంటే
శిల్పారామం షో కేసుల్లో
పల్లెలను వేలాడదీసిన రాజ్యానికి
కంట్లో నలుసు పడ్డ వేదన
రహస్యంగా చూపుడు వేలు
నొక్కిన రాజ్యం ముందు
కడుపు చినిగిన దృశ్యమై
రెప్పకింది దుఃఖమై
ఆయుధాల వాకిట్లో పల్లె.

'పావుసరే'లుగా మారారని చెబుతారు. అష్ట దిక్పాలకులు 'దోల్జా'గా, రాట్నానికి పలకలుగా మారారని విశ్వసిస్తారు.

మగ్గంలో ఇతర భాగాలైన ధోర్‌తాడుగా ఆదిశేషుడు, దిండుగా లక్ష్మీదేవి, ధమ్‌నిగా సరస్వతీ, కుంటాగా వృక్షరాజు, ఛాట్‌గా సుదర్శ చక్రం, ధోటులాలీగా నారదుడు ఉంటారంటారు. జగన్మాత పార్వతీదేవి ఏరికోరి తాను 'ఫణి' గా అయింది. ఈ పదాలన్నీ మరాఠీ పదాలు గనక తెలుగు నేలపై ఉన్న తెలుగువారికి కాస్త కొత్తగా ఉండొచ్చు.

చేనేత కులస్థుల్లో దేవతాంశగల మూల పురుషులు తొగటవీర క్షత్రియులు. దుష్టసంహారం కోసం యుద్ధం చేసే పరమ శివుడి చెమట చుక్కల నుండి జన్మించిన దేవతాశక్తి శ్రీ వీరచౌడేశ్వరీదేవి. ఈ దేవి మహిషాసురుని, ఇతర రాక్షసులని సంహరించేందుకు తనకు సహాయముగా శివుడి నుండి మూడు వందల అరవై అక్షింతలను గ్రహించి పుష్పాండజుడను రాజర్షికి అనుగ్రహిస్తుంది. అతడు వీటిని తొగరపుష్పాలు అంటే కందిపూలలో పెట్టి ఒక యాగాన్ని చేయడం ద్వారా యజ్ఞకీలల నుండి జన్మించిన మహావీరులు తొగటవీరులు. తొగర పుష్పాల నుండి జన్మించడం, అగ్నికీలల నుండి వుద్భవించడం, క్షత్రియ సంజాతకులు కావడం వల్ల వీరిని తొగటవీర క్షత్రియులని, పుష్పాండజ వంశగోత్రీకులని వీరిని అంటారు.

తొగట వీరులు రాక్షసుల్ని హతమార్చిన తర్వాత భగవతి ఆదేశంతో మానవజాతికి అత్యవసరమైన బట్టల నేతకళానైపుణ్యాన్ని స్వీకరిస్తారు. ఇటు క్షత్రియత్వంతో, అటు నేతపనితో వీరు మానవజాతికి చేసిన మేలు అనిర్వచనీయం. తొగటవీరుల సాహసాలు, దేవీమహిమలు తెలిపే కథలెన్నో ప్రచారంలో ఉన్నాయి.

చేనేత కులాల్లో మరో వర్గం 'కుర్నేసాలెలు'.. రాయలసీమలోని అనంతపురంజిల్లాకు చెందిన రాయదుర్గం, కర్ణాటకలోని బళ్ళారి, గదగ్ ప్రాంతాల్లో, మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాల్లో వీరి సంఖ్య గణనీయంగా ఉంది. కుర్నిసాలెలు నీలకంఠేశ్వరున్ని పూజిస్తారు. కుర్నిసాలెలు గురించిన విషయాలు చాలా మందికి చాలా తక్కువ తెలుసు. శ్రమజీవుల సంస్కృతిని వివరించే వృత్తి పురాణాల్లో కూడా చేనేతల ప్రాధాన్యత ఎంతో కనిపిస్తుంది. ప్రసిద్ధ కమనీయ దృశ్యకావ్యం 'మల్లీశ్వరి' లో పద్మశాలీల జీవితాలనే కె.వి.రెడ్డిగారు తెరకెక్కించారు. ఈ చిత్రంలో నాయికా నాయకులు పద్మశాలీలే.. పైగా ఈ సినిమాలోని పద్మశాలీల వీధి నమూనా అనంతపురం జిల్లాలోని తాడిపత్రిలోని పద్మశాలీవీధి అనే చెబుతారు.

పురాణకాలం నుండి నేటివరకు, దేవతలకు దుస్తుల్ని అందించడమే కాకుండా ముంబయి బట్టల మిల్లులకు ప్రాణవాయువై నిలిచిన చేనేత వర్గానికి చెందిన కార్మికులు ప్రస్తుతం ఆందోళనలో ఉన్నారు. ముఖ్యంగా సిరిసిల్లా లాంటి చేనేత బహుళ ప్రాంతాల్లో రోజుకో ఆత్మహత్యల ప్రహసనం కొనసాగుతోంది. సిరిసిల్లాలోని కార్గిల్ లేక్‌లో పద్మశాలీల కన్నీరు వెల్లువై ప్రవహిస్తోంది. బడాబడా నాయకులు సిరిసిల్లాను దర్శించుకున్నారు. కానీ ప్రసాదమేదీ ఈ అభాగ్యులకు దక్కలేదు. ముంబయిలో మిల్లులు మూతబడ్డ తర్వాత ఇక్కడి నేత కార్మికుల పరిస్థితి కూడా అగమ్యగోచరంగానే తయారైనప్పటికీ, ఉపాధి కేంద్రం కావడం వల్ల ఆకలి చావులు తప్పాయేమో కానీ వేలాది మంది కార్మికులు ఇంకా కష్టాల కడలిలో ఈదుతూనే ఉన్నారు.. వీరి కష్టాల కథల్ని వినే నాయకులు ఎవరైనా ఉన్నారా..?!!

(Inputs collected from 'Weavers & Looms' & other books)

❋❋❋



జరగబోయే కార్యక్రమాల దర్పణం

## తేది: 26 జులై, 2014. శనివారం, సాయంత్రం, జానపద జల్సాలు

కళలు మన దేశానికి పట్టుకొమ్మల్లాంటివి. ఆచారవ్యవహారాలు, పండుగలు పబ్బాలు అన్నీ కళలతో ముడివడి ఉంటాయి. మన దైనందిన జీవితంలో కూడా మనకు తెలియకుండానే కళల ప్రదర్శన జరుగుతుంది. అది గానమైన కావొచ్చు, కవితైనా కావొచ్చు, నృత్యమైన కావొచ్చు. పసిపిల్లాడి ఏడుపు ఒక గానమైతే, బుడిబుడి అడుగుల్లో కూడా మనం నృత్యాన్ని చూడొచ్చు. ఆధునిక సమాజంలో కళల పట్ల ఆదరణ తగ్గిపోతుందనీ ఎందరో మేధావులు ఆందోళన చెందుతున్నారు.

అందుకే ఆంధ్రమహాసభ తమ వంతుగా కళలను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో 26 జులై నాడు జానపద నృత్యప్రదర్శన ఏర్పాటు చేశాం. మనదేశంలోని ఎన్నో నగరాలతో పాటు పలు ప్రపంచదేశాల్లో నృత్యప్రదర్శనలు ఇచ్చి 18సార్లు ఉత్తమ నృత్యదర్శకుడిగా జాతీయస్థాయిలో అవార్డులతో పాటు 8 బంగారు పతకాలు సాధించిన నాట్యప్రవీణ శ్రీకాంత్ రఘుపాత్రుని బృందం ముంబయి కళాప్రేమికుల్ని అలరించేందుకు వస్తోంది.



ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలనీ సంస్కృతికశాఖ ఉపాధ్యక్షులు గట్టు నర్సయ్య, సంస్కృతికశాఖ సంయుక్తకార్యదర్శి శ్రీమతి రాధమోహన్ మరియు కార్యవర్గం విజ్ఞప్తి చేస్తోంది.

---

జరగబోయే కార్యక్రమాల దర్పణం

## తేది: 15, ఆగస్ట్, 2014, శుక్రవారం ఉ॥ 10.00 గం॥లకు,

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

దేశ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్ని ఎప్పటిలాగే ఆంధ్రమహాసభ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించనున్నాం. ఉదయం 10 గంటలకు జెండావందనం తరువాత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడతాయి.



ఈ సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచే గాన, నృత్య. వినోద కార్యక్రమాల్ని ప్రదర్శింపనున్నాం. ఈ కార్యక్రమంలో ముంబయిలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు పాల్గొంటారు. ఆ తర్వాత ప్రతి సంవత్సరం మాదిరిగానే పదవ, పన్నెండవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతుల ప్రదానం జరుగుతుంది.

అంతేగాక, ఎన్నిక చేయబడిన పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల రూపంలో ఆర్థిక సహాయాన్ని అందించి వారిని ప్రోత్సహించాలనుకుంటున్నాం. దీనికి సంబంధించిన వివరాల కోసం, దరఖాస్తు కోసం మహాసభ కార్యాలయంలో సంప్రదించాలనీ మనవి.

ఆ తర్వాత విచ్చేసిన అతిథులకు, ఆహ్వానితులకు పసందైన భోజనాన్ని వడ్డించే ఏర్పాట్లు చేస్తున్నాం.

మహాసభలో నిర్వహించే స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని పరిపాలనశాఖ ఉపాధ్యక్షులు అనుమల్ల రమేష్ మరియు పరిపారనశాక సంయుక్త కార్యధర్శి యెలిగేటి రాజ్‌కుమార్ మరియు కార్యవర్గం తరఫున మీ అందరిని కోరుతున్నాం.

సమీక్ష

దర్పణం

# అణువు నుండి ఆకాశం దాకా


# 'అమ్మే..'

– మిత్ర

**'అమ్మ'ను కాదు.. అమ్మ అనే పదాన్ని నిర్వచించేందుకు కూడా ప్రపంచభాషలేవీ సరిపోవు...'**

**అమ్మలేకుండా మానవజాతికి మనుగడే లేదు. నాన్న నమ్మకం మాత్రమే.. అమ్మ నిజం..! అమ్మానాన్నలిద్దరూ మనిషి పుట్టుకకు మూలాధారమైనప్పటికీ అమ్మే మనిషికి తొలి దేవత.. నేస్తం.. ఆత్మ.. పరమాత్మ కూడా..! అమ్మనాన్నల మధ్య స్థాయి బేధాలు ఏవీ లేకున్నా కడుపులో నుండి బయటకు వచ్చిన శిశువు ముందుగా వెతుక్కునేది అమ్మనే.. ముందుగా గుర్తించేది కూడా అమ్మనే..! అమ్మ అంటే అనిర్వచనీయమైన, అలిఖితమైన గొప్ప కవిత.. కావ్యం కూడా..!!**

అమ్మ గురించి ఎందరో కవులు ఎన్నోసార్లు కవితలు రాసుండొచ్చు.. ఎందరో రచయితలు తమ కథల్లో, నవలల్లో అమ్మ అమృతహృదయాన్ని ఆవిష్కరించి ఉండొచ్చు.. ఎన్నో సినిమాల్లో అమ్మ పాత్రను హృద్యంగా చిత్రించి ఉండొచ్చు.. కానీ ఎందరో కాకలు తీరిన కవులతో పాటు మరెందరో వర్ధమాన కవులందరితో అమ్మ గురించి, అమ్మ గొప్పతనం గురించి, అమ్మలోని కమ్మదనం గురించి కవిత్వాన్ని పండింపచేయడం ఒక్క **బైస దేవదాస్ గారికే** దక్కింది.




**నేటి నిజం** పత్రికతో తెలుగునేలపై కవులకు అతిపెద్ద వేదికనందించిన **బైస దేవదాస్‌గారు** ఎన్నటికీ పాతబడని అమ్మ అనురాగాన్ని వ్యక్తీకరించేందుకు 136 మంది కవులతో **'అమ్మ'** అనే కవితాసంకలనాన్ని తీసుకొచ్చారు. ఇది నిజంగా ఎంతో ఓపికతో కూడుకున్న యజ్ఞం.. దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్న 136 మంది కవులను సంప్రదించి, వారి ఫోటోలను, వారి తల్లిగారి ఫోటోలను సేకరించి, కవితల్ని అందంగా ముద్రించి ఒక అపూర్వమైన గ్రంథంగా తీసుకురావడం సాహసోపేతమైన పని. దినపత్రిక సంపాదకత్వంలో కాస్తంతా రొటీన్‌తనం ఉంటుందేమో కానీ ఇలాంటి సంకలనం తీసుకురావడానికి నిత్యచైతన్యం, సృజనాత్మకత అపరిమితంగా ఉండాలి. ఈ సంకలనం చూసింతర్వాత **బైస దేవదాస్‌గారి** వద్ద ఆ రెండు పుష్కలంగా ఉన్నాయనీ చెప్పొచ్చు.

యుగాలెన్నో అంతమైనా, అమ్మ అనే అమృతధార ఎన్నటికీ ఎండిపోదు. మనిషి ఏ రంగంలోనైనా ఉన్నత శిఖరాలు అధిరోహిస్తే అందుకు అమ్మే కారణం. పుట్టిన బిడ్డ ఏడ్పును కూడా సంగీతంగా మార్చే శక్తి అమ్మకు ఉంది. పుట్టిన వెంటనే తన జోల పాటలతో బిడ్డకు కవిత్వాన్ని ఉగ్గుపాలతో పట్టిస్తుంది. ఫలాపేక్ష కోరని అమ్మ కఠిన శిలల్ని కూడా అద్భుతమైన శిల్పాలుగా చెక్కుతుంది.

**'అమ్మను దేవతగా చేయకండి మిత్రులారా/ మనిషిగా గుర్తిస్తే చాలు..'** అన్న ఎన్. అరుణగారి కవితతో మొదలైన ఈ సంకలనం **'నా బంగారు భవిష్యత్తుకు పునాది అమ్మ/ ఋణం తీర్చుకునేందుకు చాలదు ఈ జన్మ..'** అన్న డా॥శిల్ప పంక్తులతో ముగుస్తుంది. కానీ మధ్య పేజీల్లో అమ్మకు చెందిన ఆవేదనలు, ఆందోళనలు, నిర్లక్ష్యాలు, నిర్వేదాలు, వ్యథలు, కథలెన్నో గుండెను మండిస్తాయి.. పండిస్తాయి కూడా..!

**నిలువెల్లా అమ్మతనం తీగగా సాగిన /మల్లెపందిరి**

**మాయమ్మ..'** అంటారు డా॥రాచపాళెం. **అమ్మ ఆజ్ఞ ఇవ్వాలి గానీ / పుట్టుక నుండి చావుకు దూకగలను'** అంటూ విధేయతను ప్రకటించుకున్నారు బైస సదానంద్. **'భ్రష్టుడా! అమ్మరుణం తీరదు/ అమ్మకు అమ్మవై పుడితే తప్ప..** అంటూ అమ్మగురించి అత్యంత భావుకతతో చెబుతారు డా॥ఎన్.గోపిగారు.

**నలుపు తెలుపుల అమ్మ ఫోటోను తన జ్ఞాపకాల్లో రంగుల మయం** చేసుకుంటాడు మౌనశ్రీ మల్లిక్. **అమ్మతో నేను.. నాతో అమ్మ / రక్తస్పర్శ విశ్వజ్వలన గీతం** అంటారు జనజ్వాల. **మా నిరంతర జ్ఞాపకాల జాడ / మా వెన్నంటి కాపాడే నీడ అమ్మ ..** అని డా॥ఎస్వీ సత్యనారాయణ స్మరించుకుంటారు. **సుఖాల పల్లకి ఎక్కిద్దామనుకుంటే / నా పని ముగిసిందని .. వెళ్ళిపోయిన అమ్మ** గురించి ఆవేదన పడతారు డా॥ద్వానా శాస్త్రి..

**జ్ఞాపకాలు రాసుకుంటుంటే ఫోటోల అమ్మ నవ్వుతున్నది / అమ్మ ఉన్నట్లే..** అంటూ అమ్మ విశ్వవ్యాప్తం, కాలాతీతం అని అంటారు కందాళై రాఘవాచార్య. **అమ్మతనం కన్నా అద్భుతం లేదు / ఇంద్రపదవి అంతకన్న గొప్పది కాదని** ప్రకటిస్తారు కోపూరి పుష్పాదేవి. **చిన్నప్పుడు అమ్మ చిటికెన వేలు పట్టుకొని / లోకాన్ని జయించినంత / ధీమాగా నడిచెటోణ్ణి** అంటూ అమ్మ కొంగు నీడలో ఉన్న ధీమాను ప్రకటిస్తారు చిన్ని నారాయణరావు. **అవ్యక్త జ్ఞాపకాల మధుర సందేశం అమ్మ** అంటారు డా॥విప్లవదత్ శుక్లా. **అమ్మ కవ్వం తిప్పడం చూస్తేనే / కలం తిప్పడం అలవాటవుతుంది / అమ్మ కానిదేదీ కవిత్వం కాదని...** నిర్ధారిస్తారు డా॥ బీరం సుందరరావు. **రెండు పెదాలను కలిపిన మాటే అమ్మ / నిండు మనసులో పలికిన పాటే అమ్మ..** అంటూ స్తుతిస్తారు చిమ్మపూడి శ్రీరామమూర్తి.

**అమ్మ చేతి గోరుముద్ద / అమృతం కన్న గొప్పది / అమ్మ చేసిన వంటకాలు / నలభీములకే సవాలంటారు** మాడిశెట్టి




గోపాల్. **వత్తిలా కరిగి వెలుగు పంచావు / ముళ్ళలో నడిచి పూలు పరిచావు..** అంటూ కొనియాడుతారు డా॥ టి. గౌరీశంకర్. **నా ఆగడాలు అదుపు చేసేందుకు / అప్పుడప్పుడు నాన్న కోపాగ్ని రగిలితే / అమ్మ సమర్థన ప్రేమ సముద్రమై నా చుట్టూ రక్షణ కవచమై నిల్చేది..** అంటూ అమ్మను, నాన్నను ఒకే శ్వాసలో ఆవిష్కరిస్తారు కొండ్రెడ్డి వెంకటేశ్వర రెడ్డి. **ఏ అణువు స్పర్శించినా అమ్మ వొడి వెచ్చనే / ఏ కణం కదిపినా అమ్మ మమతల తడే ..** అంటారు ఈతకోట సుబ్బారావు.

**అమ్మ ఎనభైయ్యేళ్ళ / ముదివగ్గైనా / అరవైయ్యేళ్ళు దాటిన నన్ను/ అంత పసివాడుగా తలపోసిందంటూ..** ఎంత ఎదిగినా అమ్మకు బిడ్డగానే ఉంటారని చెప్పారు డా॥తిరునగరి. **నా కంటి రెటీనా తెరపై ఓ పచ్చని జ్ఞాపకం అమ్మ..** అంటూ ఆవేదన చెందుతారు బిక్కి కృష్ణ. **కిరణం ప్రసరించిన ప్రతి కణకణంలో అమ్మ / వాయువు ప్రవహించిన / ప్రతి అణువణువులో అమ్మ..** అంటూ అమ్మకు నివాళులర్పిస్తారు కందుకూరి శ్రీరాములు. **చీమిడి ముక్కుతో తిరుగుతూ వుంటే / చీదరించుకోకుండా చీరకొంగుతో తుడిచావు..** అంటూ అమ్మను యాదిచేసుకుంటారు సాహిత్య ప్రకాశ్. **భారత పతాకమంత ధైర్యాన్నిచ్చిన / మా అమ్మ ఋణాన్ని ఎన్ని జన్మలెత్తినా తీర్చుకోలేననీ..** ప్రకటిస్తారు కె.వి.రమణారెడ్డి.

**నువ్వు పోయి కూడా / పిడికెడు పిండాన్ని / కాకికో గోవుకో తినేలా / ఏర్పాటు చేస్తున్న తల్లీ / నీ త్యాగానికో దణ్ణం ..**అంటూ మాతృభక్తిని వెల్లడిస్తారు వి.పి.చందన్‌రావు. **పట్నం నుండి ఇంటికి నేను వస్తున్నానంటే / కంటికి కనిపించకుండా అమ్మ నాకోసం / సీతాఫలాలు రవికలో దాచుకొని తెచ్చేది..** అంటూ బాల్యం లోకి వెళ్ళిపోతారు డా॥ మసన చెన్నప్ప. **ఆమె మాట్లాడు మాటల్లో / జాలువారు అమృతం / ఆమె ఓదార్పు వెన్నెల కన్న చల్లదనం..** అంటారు దాస్యం సేనాధిపతి.

ఇలా 136 మంది కవులు కమ్మనైన అమ్మలోకంలో కవిత్వాన్ని పండించారు. అందరి కవితల్ని పేర్కొనడం అసాధ్యమైన విషయం. పైన పేర్కొన్న కవులతో పాటు ఈ సంకలనంలో డా॥మాడభూషి శ్రీధర్, జి.ఏ.రహీం, డా॥ తెన్నేటి సుధాదేవి, డా॥నాళేశ్వరం శంకరం, డా॥యిమ్మిడిశెట్టి చక్రపాణి, వడలి రాధాకృష్ణ, కొట్టి రామారావు, గరిశకుర్తి శ్యామల, మరికంటి, శైలజామిత్ర, పెంటమరాజు నరసింగరావు, నడిమెట్ల రామయ్య, ఏ.రేణుక, వనం రాజేశ్, పోరండ్ల శ్రీనివాస్, పెద్దూరి వెంకటదాసు, డా॥పెళ్ళకూరు జయప్రద, వీరారెడ్డి, దోసపాటి సత్యనారాయణ, డా॥లక్ష్మణాచార్యులు, ఆచార్య నరేంద్ర,

చేగిరెడ్డి చంద్రశేఖరరెడ్డి, అద్దేపల్లి జ్యోతి, గుర్రాల రమణయ్య, వాసాల శౌరి, వనపట్ల సుబ్బయ్య, రుద్రవరం ఎల్లయ్య, మాచవోలు శ్రీధరరావు, ఏ.ఆంజనేయప్రసాద్, వేములవాడ జనార్ధనాచారి, వెంకటశేషగిరిరావు, భమిడిపాటి ప్రసాదరావు, దుగ్గిరాల సోమేశ్వరరావు, రవిప్రసాద్, పనసకర్ల ప్రకాశ్, ఆర్.దమయంతి, శాగంటి శ్రీకృష్ణ, శ్రీనివాసరాజు, అనూరాధ, అమరజ్యోతి, కె.సి.లలిత, ఎన్వీ రఘువీర్‌ప్రతాప్, బి.హనుమారెడ్డి, సిరాజొద్దీన్, సామ లక్ష్మారెడ్డి, అనిశెట్టి రజిత, దేవపాలన, పృథ్వీ, జోసెఫ్, కీర్తి, డా॥శ్రమశ్రీ, లక్ష్మణ్‌రావు, అడువాల సుజాత, విజయలక్ష్మి, అంజినాదేవి, మాధవీసనారా, గఫూర్ శిక్షక్, నీహారిణి, దామెర రాములు, నాగమణి, రాఘవాచారి, సుభాని, కాసోజు, లత, డివిఆర్‌కే శాస్త్రి, గంధం విజయలక్ష్మి, డా॥ ప్రసాదమూర్తి, సీహెచ్ ప్రకాశ్, ఏలేశ్వర నాగభూషణాచార్య, చలపాక ప్రకాశ్, రాజయ్యగౌడ్, సింహాద్రి, శ్రీనివాసరెడ్డి, అస్లాంషరీఫ్, పద్మకళ, అంబల్ల జనార్దన్, సత్యం, ప్రసాద్‌రావు, పద్మావతి, తంగిరాల చక్రవర్తి, దేవదానం, డా॥లింగారెడ్డి, సుబ్బరాయమూర్తి, కన్నోజు లక్ష్మీకాంతం, దిలావర్, నాగిరెడ్డి, శ్రీమాన్ శ్రీకాశ్యప, లంకా వెంకట సుబ్రహ్మణ్యం, రంగనాథ్, డా॥పోతుకూచి, జగన్‌మాధవరావు, బాలవర్ధిరాజు, గరిశకుర్తి రాజేంద్ర, సంబరాజు, సూర్యారావు, రాణీప్రసాద్, డా॥బోయ జంగయ్య, కోటం, లలిత, డా॥రావి రంగారావు, యెల్ది సుదర్శన్ పద్మశాలి, సంకేపల్లి నాగేంద్రశర్మ, సబ్బని లక్ష్మీనారాయణ, సివి కొండయ్య, దొర్నాదుల సుబ్బమ్మ, పొత్తూరి సుబ్బారావు, కూకట్ల తిరుపతి, ప్రసాద్, నిఖిలేశ్వర్ లాంటి మహామహుల కవితలెన్నో ఉన్నాయి.

ఒక అద్భుతమైన అమ్మలోకంలోకి తీసుకెళ్ళిన బైస దేవదాస్‌గారు అభినందనీయులు. అమ్మంటే బరువుగా భావిస్తూ, వృద్ధాశ్రమాలకో, అనాధశ్రయాలకో నిర్దయగా పంపిస్తున్న సంతానం ఈ పుస్తకాన్ని ఒక్కసారి చేతుల్లోకి తీసుకుంటే బహుశ.. వారి గుండెల్లో ఎక్కడో ఓ తడిరేఖ కదిలి అమ్మను అక్కున చేర్చుకుంటారేమో..! ఈ పుస్తకం ఏ ఒక్క అమ్మకు మళ్ళీ ఆశ్రయం కల్పించినా దేవదాస్‌గారి కృషి సత్ఫలితాన్ని ఇచ్చినట్లే..!

❋❋❋

జీవితంలో ఓటమి అనేది
ఒక సంఘటనే.....
కానీ ఒక సమస్య కాదు!!

# బురదలో చేప

**- యార్లగడ్డ రాఘవేంద్రరావు**

సాహితీ దర్పణం

అంతా అస్తవ్యస్తం
ఒకానొక అసంకల్పిత బీభత్సం
రాత్రి ఒలికిన ఆకసాన్ని
రాజేస్తున్న కిరణంలా
గుండె కిందో వేడిసెగ
నీలి సముద్రాలకవతల
నీరెండకు పిచ్చుకగూడు
అల్లాలనే భ్రమ
చివరకు అన్ని సమాగమాల మీద
ప్రశ్నార్థకాల శల్యసారథ్యం
వెళ్ళిపోతూ మళ్ళొస్తానని
మాటవరసకైనా చెప్పని హృదయం
పోస్టు చేయలి ఉత్తరంలా
లోలోన మిగిలిపోయిన ఆంతర్యం
తవ్వుకునే కొద్దీ
తీగసాగిన అవమానంలో
తెగనరికిన నమ్మకం
రుతువులన్నీ నేనై నేనే తానైన పాలపిట్ట
ఇప్పుడెటో ఎగిరిపోయిన అపహాస్యం..

+++

ఆరోవేలి వక్రబంధంలో
వెక్కిరిస్తున్న చిటికెన వేలు
అసందర్భ రతి భంగంలో
ఋష్యశృంగుని అభౌతికాక్రందన
భూమధ్యరేఖ మీద కాలు మడతపడ్డ చరిత్ర
వెనక నిలబడి వెక్కిరిస్తున్న నాలుగో పార్శ్వం

+++

నిన్న అరుదైన గులాబీ
నేడు బురదలో చేప
నిన్న నిజమంత దగ్గర
నేడు స్వప్నమంత దూరం!

❋❋❋

LIC
LIFE INSURANCE CORPORATION OF INDIA

Shankar R. Chenna
9869279272 / 2437 3312



# Revan Investment

## Special plans for Ladies

**OUR SERVICE RENDER**

- Premium Collection
- Claim Settlement
- Loans to Policy Holders
- Alternation in Policy & transfer
- Nomination Assignment
- All Services at Doorstep

- Life Insurance Corporation of India
- Mutual Funds
- Mediclaim Insurance
- House Holders Insurance
- Shopkeepers Insurance
- Standard Fire Insurance
- Burglary Insurance
- Personal Accident Policy
- Overseas Mediclaim Insurance
- Office Umbrella Policy
- IT Returns & PANCard
- NRI Insurance & HOME LOANS

**: RESIDENCE :**

9/43, Madhusudan Chawl, Khedgully, Sayani Road, Mumbai - 400 025.

**C/o Off.: Vijay Tailors :** B.D.D. Chawl No.43, Shop No.8,
Worli, Mumbai - 400 018. **Tel.:** 2494 6123

మన చరిత్ర

దర్పణం

– బైరి రామస్వామి



# భీవండిలో తెలుగువారు

**ముంబయికి 50 కి.మీ దూరంలో ముంబయి నుండి నాసిక్ వెళ్ళే అగ్రారోడ్‌కు ఇరువైపులా భీవండి నగరం వ్యాపించి ఉంది. భీవండికి 30 కి.మీ. దూరంలో వజ్రేశ్వరీ దేవి పుణ్యక్షేత్రం ఉంది.**

1840లో ఆంధ్రప్రదేశ్‌లో చేనేత పరిశ్రమ కుంటుపడినప్పుడు ఆ రంగంపై ఆధారపడ్డవారు పొట్టచేతబట్టుకొని మహారాష్ట్రలో చేనేత పరిశ్రమలున్న వివిధ ప్రాంతాలకు వలస వచ్చారు. ఆ విధంగా ఆహ్మద్‌నగర్‌కు వలసవెళ్ళి అక్కడే స్థిరపడిన తొమ్మిది కుటుంబాలకు చెందిన అరకల్ నారాయణ, దూస నారాయణ, అన్నం రుక్మాజీ, తమ్మల్ దత్త్రాద్రి, తన్నీరు బుగ్గయ్య, జట్ల బాలయ్య, గాజుల విఠోబా, వల్లాల భూమయ్య, గెంట్యాల బుచ్చయ్య తదితరులు మరింత మేలైన ఉపాధి కోసం భీవండికి చేరుకున్నారు. భీవండికి చేరుకున్న మొదటి తెలుగువారిగా వీరినే చెబుతారు.

1941లో స్వాతంత్ర్య సంగ్రామం మరియు 1942లో జరిగిన 'చలేజావ్' ఉద్యమంలో వల్లాల రామయ్యతో సహా పలు భీవండి తెలుగు ప్రజలు కూడా చురుకుగా పాల్గొన్నారు. వల్లాల రామయ్య స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నందుకు 9 నెలల జైలు శిక్షను, 'చలే జావ్' ఉద్యమంలో పాల్గొన్నందుకు 6 నెలల జైలు శిక్షను కూడా అనుభవించారు. భీవండిలో ఉపాధి మార్గాలు పెరగడం వల్ల, తెలంగాణలో కరువు కాటకాలు విపరీతం కావడం వల్ల భీవండికి తెలుగువారి వలసలు పెరిగాయి. అప్పట్లో భీవండి జనాభా 35 వేలు ఉంటే అందులో తెలుగువారి జనాభా 500 అయింది.

1957 నుండి భీవండిలో మరమగ్గా ల సంఖ్య ఊపందుకోవడం వల్ల తెలంగాణ లోని కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, అదిలాబాద్, నల్గొండ జిల్లాల నుండి నేతపనిలో నైపుణ్యం కలిగిన పద్మశాలీయులతో పాటు మిగతా కులాలకు చెందిన తెలుగు వారు భారీ సంఖ్యలో భీవండికి చేరుకోసాగారు.

**రాజకీయ రంగం:**

కాలక్రమేణ భీవండిలో తెలుగువారు ముఖ్యంగా పద్మశాలీయులు రాజకీయ రంగంలో చురుకైన పాత్ర పోషించసాగారు. 1967లోనే కార్పొరేటర్‌లుగా ఎన్నికయ్యారు. వీరిలో వల్లాల రామయ్య, కోడం రాజారాం గార్లు మొదటితరానికి చెందినవారు. రామయ్యగారు నగరపాలిక ఉపాధ్యక్షులుగా, విద్యామండలి సభ్యుడిగా కూడా ఎన్నికయ్యారు.

ఈ క్రమంలోనే కమటం శంకర్, దాసి అంబదాస్, బత్తిని సాయన్న, శ్రీమతి బైరి భారతి, గాజెంగి రాజేశం, గాజుల


ఆగదాసు, గుండ్ల శంకర్, సిద్దేశ్వర్ కామ్మూర్తి, భైరి రామస్వామి, శ్రీమతి మిట్ట శశికళ, శ్రీమతి వంగ లక్ష్మీబాయి, దీకొండ దేవరాజం, శ్రీమతి గాజుల ఈశ్వరీబాయి, శ్రీమల్ల మల్లేశం, మామిడాల నారాయణ, శ్రీమతి చెన్న లక్ష్మీబాయి, కళ్యాడపు బాలకిషన్, శ్రీమతి దాసి పెంటాబాయి తదితరులు కార్పోరేటర్‌లుగా ఎన్నికై ఈ పరాయి రాష్ట్రంలోని భీవండిలో తెలుగు కేతనాన్ని సగర్వంగా ఎగరవేశారు. వీరిలో కొందరు రెండు మూడు సార్లు ఎన్నికైన వారు కూడా ఉన్నారు.

గతంలో కమటం శంకర్ ఉపనగరాధ్యక్షులుగా, శ్రీమల్ల మల్లేశం నగరాధ్యక్షులుగా ఉన్నత పదవుల్ని అలంకరించారు. కామ్మూర్తి సిద్దేశ్వర్, దాసి అంబదాస్, శ్రీమతి భైరి భారతి వివిధ శాఖల చైర్మెన్ పదవుల్ని అధిరోహించారు. విద్యామండలి సభ్యులిగా భైరి రామస్వామి, కుందెన్ పురుషోత్తం, గాజుల ఆగదాసు, గాజెంగి రాజు విధులు నిర్వహించారు. గాజుల ఆగదాసు విద్యామండలి చైర్మెన్ పదవిని కూడా అలంకరించి తెలుగు వెలుగుల్ని వ్యాపింపచేశారు. ప్రస్తుతం గాజెంగి రాజు విద్యామండలి సభ్యుడిగా, మచ్చ మురళి కార్పోరేటర్‌గా కొనసాగుతున్నారు. అంతేగాక, నూతనంగా భీవండి పట్టణ పరిధిలో చేరిన కారోలి గ్రామపంచాయితీకి సభ్యులుగా బత్తిని నరేశ్, గుండు వసంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

**<u>తెలుగువారి జీవన విధానం</u>ః**

భీవండిలో మరమగ్గాల రంగమే ప్రధాన జీవనోపాధి. మన తెలుగువారెందరో ఇక్కడ మరమగ్గాల పరిశ్రమల్ని నెలకొల్పి మాస్టర్ వీవర్స్‌గా స్థిరపడ్డారు. వేలాది తెలుగు కార్మికులు ఈ పరిశ్రమల్లో ఉపాధి పొందుతున్నారు. అంతేగాక, బట్టల దుకాణా లు, టైలరింగ్ షాపులు, స్టూడియోలు, మెడికల్ షాపులు, హోట ల్స్, సినిమా థియేటర్స్‌లాంటివి స్థాపించి తాము ఉపాధి పొందడ మే కాకుండా ఎందరో తెలుగువారికి ఉపాధి కల్పిస్తున్నారు.

డాక్టర్స్‌గా, లాయర్లుగా, టెక్స్‌టైల్ డిజైనర్స్‌గా, కంట్రాక్టర్స్‌గా మన తెలుగువారు ముందంజలో ఉన్నారు. బీడీలు, అప్పడాలు లాంటివి తయారు చేసే పనిలో వందలాది మహిళలు కూడా నిమగ్నమై ఉన్నారు.




**<u>విద్యారంగంః</u>**

ఒకప్పుడు పొట్టచేత బట్టుకొని వలస వచ్చిన తెలుగు వారు నేడు అన్ని రంగాలతో పాటు విద్యారంగంలో కూడా ఎంతో అభివృద్ధి సాధించారు. భీవండి తెలుగువారిలో విద్యాగంధం పెంచేందుకు 'తెలుగు సమాజ్ శిక్షణ్' సంస్థను స్థాపించుకున్నారు. ప్రస్తుతం ఈ సంస్థ అధ్వర్యంలో తెలుగు జనసాంద్రత గల వివిధ ప్రాంతాలలో ఎన్నో పాఠశాలలతో పాటు తెలుగువారందరికీ మణిమకుటంగా నిలిచిన జూనియర్ కాలేజీని కూడా నిర్వహిస్తున్నారు.

అంతేగాక, బాలాజీ ఎడ్యుకేషన్ సొసైటీ, శారదా ఎడ్యుకేషన్ సొసైటీ, కాకతీయ ఎడ్యుకేషన్ ట్రస్ట్, ఆదర్శ ఫౌండేషన్ ట్రస్ట్ తదితర
సంస్థలు కూడా పలు పాఠశాలలు నిర్వహిస్తూ తెలుగుతనాన్ని పరిరక్షిస్తున్నాయి. పాఠశాలలతో పాటు జై భారత్ గ్రంథాలయం, తెలుగు ప్రతిభా కళాభారతి గ్రంథాలయం లాంటివి నెలకొల్పి భీవండి తెలుగువారు తెలుగువారి జ్ఞానాభివృద్ధికి తోడ్పడుతున్నారు.

**సాహిత్యరంగంః**

తెలుగు సాహిత్యరంగంలో కూడా భీవండి తెలుగువారు అగ్రస్థానంలో ఉన్నారు. వచనకవిత్వం రాజ్యమేలుతున్న ఆధునిక కాలంలో సాంప్రదాయ చందోబద్ద కవిత్వాన్ని ఇంకా బతికిస్తున్న వారిలో భీవండి తెలుగు సాహితీవేత్తలు ఎందరో ఉన్నారు. రాపోలు లక్ష్మీపతి, గండూరి లక్ష్మీనారాయణ, వడిగొప్పుల శంకర్, బొడ్డు శంకర్ అనేక ఛంతోబద్ద కవితాసంపుటాలను వెలువరించారు. వీరేగాకుండా భైరి రామస్వామి, డా॥ పాము మనోహర్, రాజ్‌గిరి బాల్‌నారాయణ, కుసుమ సుదర్శన్ తదితరులు కూడా తమవంతుగా తెలుగు సాహిత్యానికి సేవలందిస్తున్నారు.

భీవండిలో తెలుగు సామాజిక సంస్థలు, ఆధ్యాత్మిక సంస్థలు కూడా ఎన్నో ఉన్నాయి. తెలుగు వారు ఇక్కడ ఎన్నో మందిరాలు కూడా నిర్మించారు. దాదాపు 2.50 లక్షల మంది తెలుగువారు ఉన్న పద్మానగర్‌లాంటి ప్రాంతం పూర్తిగా మినీ తెలంగాణలా భ్రమింపచేస్తుంది. ఇక్కడ తెలుగు పండగల్ని కూడా భారీ ఎత్తున జరుపుకుంటారు. ఇక్కడ జరుపుకునే బతకమ్మ పండగా ఎంతో కన్నుల పండగగా ఉంటుంది.

మహారాష్ట్రలో తెలుగు భాషా, సాహితీ, కళా, సాంప్రదాయాల్ని కాపాడుతున్న నగరాల్లో భీవండి నిక్కచ్చిగా మొదటిస్థానంలో ఉంటుంది.

❀❀❀

బర్నింగ్ ఇష్యూ

దర్పణం

- జ్వలిత సెల్: 099891 98943

# ఆకాశంలో....
# సగంపై అకృత్యాలు



**యత్రపూజ్యతే స్త్రీ... తత్రరమంతే దేవతా..: అని శ్రీరంగనీతులు పలుకుతున్న దేశంలోనే మహిళలపై లైంగిక అత్యాచారాలు పెచ్చుమీరడానికి కారణం ఆలోచించే తీరికలేదు ఎవరికి. నగరానికి పల్లెకు మధ్య ఉన్న గీత చెరిగిపోయి ప్రపంచం ఒక కుగ్రామం కాకముందు నుండే పురాణాల కంటే ముందు నుండి కూడా స్త్రీని ఒక వస్తువుగా, ఒక బానిసగా భావించారే తప్ప ఒక మానవిగా, మనిషిగా చూడలేదు. చూడట్లేదు. కనుకనే అత్యాచారాల పరంపర అనేక రకాలుగా కొనసాగుతుంది.**

కంటికి కనబడితే చాలు వెంటాడి వేటాడి అనుభవిస్తున్నారు. అతికిరాతకంగా అంతం చేస్తున్నారు. ఒక ఆట వస్తువుగా అనేకసార్లు, తన అధికారానికి ప్రతీకగా కొన్నిసార్లు, తమ ద్వేషాన్ని తమ పగను తీర్చుకునే మార్గాలుగా మరెన్నోసార్లు స్త్రీలను బలిపెడుతున్నారు.

ఒక కుటుంబానికి మరొక కుటుంబానికి, ఒక వర్గానికి మరొక వర్గానికి, ఒక దేశానికి మరొక దేశానికి శత్రుత్వం పెరిగినప్పుడు స్త్రీలపై అత్యాచారాలు చేయడం ద్వారా తమ పగను తీర్చుకున్నారు. తమ ఆధిక్యతను చాటుకున్నారు. వాకపల్లి, ఖైర్లాంజీ, లక్కీపేట, బీర్‌భూమి లాంటి ప్రాంతాల్లో జరిగిన సంఘటనలన్నీ పురుషాధిక్యత సమాజం తమ అధికారాన్ని, అహంకారాన్ని, ప్రదరిస్తూ తన ప్రతీకారాన్ని, ఆసూయద్వేషాల్ని, మానసిక వికారాలను ప్రదర్శించే వాహకంగా స్త్రీని ఉపయోగించుకుంటున్నారనడానికి తార్కాణాలు.

మాజీ కేంద్రమంత్రి శశి థరూర్ సతీమణి సునంద హత్యకేసులో పాకిస్థాన్ మహిళా జర్నలిస్ట్ ప్రమేయం ఉండడం,ముంబయిలో చిత్రహింసలతో హత్యకు గురైన విజయవాడకు చెందిన అనూహ్య కేసు, హైదరాబాద్‌లో పెట్రోల్ పోసి తగలబెట్టబడిన నల్లగొండకు చెందిన తలారి అరుణ కేసు, ఏది చూసినా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మహిళలపై అత్యాచారాలకు మహిళలే కారకులుగా, కారణాలుగా, పరికరాలుగా, నేరాల్లో భాగస్వాములుగా కనిపిస్తారు. ఈ ప్రమాదకర దుస్థితిని మహిళాలోకం సభ్యసమాజం విస్మరించకూడనిది. అంతేకాదు. అత్యంత శ్రద్ధ వహించి పరిగణలోకి తీసుకోవలసిన అంశం.

నిత్యం పసిపిల్లలనుండి వృద్ధమహిళలపై జరిగే అత్యాచారాలు, అమాయక బాలికలను మభ్యపెట్టి లోబరచుకొని బందించి రోజులు, వారాలుగా కొనసాగిస్తున్న చిత్రహింసలు, కుటుంబ సభ్యులచే, బంధువులచే అరుదుగా అయినా కన్నతండ్రి, సొంత సోదరులచే అత్యాచారాలక గురవుతున్న సంఘటనలు, సభ్యసమాజాన్ని ప్రశ్నిస్తున్నాయి. అత్యంత ఆధునిక వైజ్ఞానికాభివృద్ధి సాధించిన సమాజంలో మానవీయ లోపాల్ని వెలుగెత్తి ప్రశ్నిస్తున్నాయి.

మహిళను మనిషిగా భావించని ఒక సామాజిక రుగ్మతను బయటపెడుతున్నాయి.


‘ఆకాశంలో సగం’ అంటూ శక్తి స్వరూపిణి అంటూ చెప్పే కల్లబొల్లి కబుర్లనీ పచ్చి అబద్ధాలనే నగ్నసత్యాన్ని నొక్కిచెబుతున్నాయి.

అత్యాచారాలు పెరగడానికి కారణం మహిళల వస్త్రధారణ, వ్యవహారశైలి మాత్రమే అని సోకాల్డ్ పెద్దలు అంటున్నారు. నాగరికత పేరుతో పెడతోవపట్టారు, చెడిపోతున్నారు అని మహిళా ప్రజాప్రతినిధులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇక నిత్యానంద స్వామి, ఆశారాం బాబా వంటి వాళ్ళ గురించి చెప్పనవసరం లేదు.

మానవ మృగాలు రూపాలు మార్చుకొని ప్రమాదాన్ని కలిగిస్తున్నాయి. అయితే మహిళలపై అత్యాచారాలకు మహిళలు కూడా సహకరించడం, సమర్థించడం ఎక్కువసార్లు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో జరుగుతూనే ఉంది. ఇది సరికాదు. ఇటువంటి కిరాతకాలను అరికట్టడానికి విలువల ప్రచారం కుటుంబం నుండి తల్లిదండ్రులు, తాత నానమ్మ,అమ్మమ్మ వంటి కుటుంబ సభ్యులనుండి పిల్లలకు నేర్పించాలి.

పాఠశాలల్లో విలువల ఆధారిత విద్యను పాటిస్తూ అందరు ఉపాధ్యాయులు బోధించాలి. ఉపాధ్యాయ వృత్తికి తప్పనిసరి నిబంధనగా కొన్ని నియమాలను పెట్టి ఉపాధ్యాయులను ఎంపిక చేయాలి. ఎంపిక తర్వాత నిషేధించబడిన అంటే మద్యం, ధూమపానం, గుట్కా వంటి వాటిని సేవించేవారిని వృత్తిలో కొనసాగనివ్వరాదు.

నేషనల్ క్రైం బ్యూరో 2010లో మహిళలపై నేరాలు 2,08,681 నమోదయినట్లు వెల్లడించింది. కానీ నమోదు కానివి గ్రామీణ ప్రాంతాలలో వెలుగుచూడని నేరాలు ఎన్నో ఊహించలేం. దేశరాజధాని ఢిల్లీలో సగటున ప్రతి ఒక గంటకు ఒక మహిళ పై అత్యాచారానికి గురవుతుంది.




ఢిల్లీ తర్వాత ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు ముందు వరసలో ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో ప్రతి వెయ్యిమంది పురుషులకు 940 స్త్రీలు ఉన్నారనీ తేలింది. భ్రూణ హత్యల ద్వారా పుట్టకముందే వధిస్తున్నారు. తల్లులను హత్య చేసిన కుమారుల సంఖ్య పెరుగుతున్నది. పరువు హత్యలు చేస్తున్న తండ్రులు, సోదరులు పెరుగుతున్నారు.

అన్ని రాజకీయ పార్టీలు విలువలు పాటిస్తూ విలువల ప్రచారాన్ని తమ బాధ్యతగా నిర్వహించాలి. మహానగరంలో జరిగినా, గ్రామాల్లో జరిగినా మహిళలపై అత్యాచారాలకు వెంటనే స్పందించగల బాధ్యతతో కూడిన ప్రవర్తనను ప్రతి ఒక్కరు అలవరచుకోవాలి.ఈ పురుషాధిక్యత అనాగరిక సంస్కృతికి వ్యతిరేకంగా పోరాటాలు జరగాలి. కొత్త వ్యూహాలతతో ఉద్యమాలు కొనసాగాలి. ఈ విష సంస్కృతికి మహిళల భాగస్వామ్యం లేకుండా చైతన్యపరచాలి. మహిళలపై జరిగే దాష్టీకాలకు మహిళలు సహకరించడం వంటి అనాగరిక, అవగాహన రహిత ప్రవర్తనలకు కారణాలు తెలుసుకొని ప్రచారం చేయాలి.

పెప్పర్ స్ప్రే, మొబైల్ ఫోన్లతో రక్షణ చర్యలకు ప్రయత్నం కాకుండా మూలాల్లో నుండి మార్పుకు మనిషి మనసు పొరల్లో, మెదడు పొరల్లోకి మహిళలను గౌరవించగల సంస్కృతికి బీజాలు నాటాలి. స్త్రీని తోటి మనిషిగా భావించగల ప్రజాస్వామిక అవసరానికి పునాదులు వేయాలి. సమాజంలో మహిళలను గౌరవించే మానవీయ కోణంలో ప్రతి ఒక్కరు కృషి చేయాలి.



# సాహిత్య విలువలు పెంచే సాధన చేద్దాం

- కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి




**తళుకు బెళుకుల ఆర్థికానందం ముందు ఆత్మానందం ఇచ్చే అక్షరం మీద ఆసక్తి నానాటికి తరిగిపోతోంది. సాహిత్యపరమైన ఆనందం అంతటా కరువై పోతోంది. ప్రపంచీకరణ ఫలితంగా పెట్టుబడిదారీ భావజాలం ధనిక, పేద వర్గాలనే తేడా లేకుండా అందరిలోనూ ఇంకిపోయింది. ప్రపంచంలో సుఖజీవనం గడపాలంటే డబ్బు ఒక్కటే ప్రధానమైన అంశంగా భావించబడుతు, అనైతిక సంపాదనకు అర్రులు చాస్తూ, అహర్నిశలు జనం ప్రశాంతత లేని ఆవేశభరితమైన జీవితాల్ని గడుపుచున్నారు.**

ఈ జీవిత విధానాన్ని అట్టడుగు వర్గాల్లో కూడా ప్రోత్సహించేందుకు చేదోడు వాదోడై సేవలందిస్తోంది ప్రింట్ మీడియా మరియు ఎలక్ట్రానిక్ మీడియా. టి.వి మీడియాల్లోని చానళ్ళను జాగ్రత్తగా గమనించినట్లయితే ఎక్కడో ఏ మూలనో జరిగిన అనైతికతా చర్యలకు ఇచ్చిన ప్రాధాన్యత సృజనాత్మకతా చర్యలకు ఇవ్వడం లేదు. గోరంతలు కొండంతలు చేసి పదేపదే చూపిస్తూ ఒకచో పరాకుగా ఉన్నవారిని కూడా ఆకర్షిస్తుంటారు. ముఖ్యంగా మనదేశంలో టి.వి. మీడియా మీద ప్రభుత్వం అదుపు పూర్తిగా లేదనే చెప్పాలి.

మనిషి మానసిక స్థితిని ప్రశాంతంగా, నిదానంగా, ఆనందంగా ఉంచే సాహిత్య కార్యక్రమాలు ఎప్పుడోగానీ వార్తల్లో తళుక్కున మెరిసి కనుమరుగవుతుంటాయి. ఏ ప్రక్రియ లో వున్న సాహిత్యమైనా నేటి వ్యవస్థాగత రుగ్మతలను ఎత్తి చూపేదిగా పాఠకులను లేదా శ్రోతలను ఆకర్షించేదిగా వుండాలి. కాలమార్పును గమనిస్తూ కదిలేకాలానికి అద్దం పట్టే అవగాహన కలిగించేదిగా సాహిత్యం రూపుదిద్దుకోవాలి. సామాజిక హితవు కోరే సాహిత్యం ఎలా వుండాలి..? ఎలాంటి ఆకర్షణ కలిగి వుండాలి..? అనే అంశాలమీద సాహితీ వేత్తలు తగిన చర్చలు జరుపవలసిన అవసరం ఎంతైనా వుంది.

వర్తమానంలో నడిచే సాహిత్యం తప్పనిసరిగా ఏదైనావో సిద్ధాంతానికి కట్టుబడిన భావధార కలిగి వుండాలి. అట్లని గ్రుడ్డిగా మార్పులేని ప్రాచీనతా భావాలకు కట్టుబడి వుండాలనేది నా ఉద్దేశ్యం కాదు. సిద్ధాంతాలనేవి ప్రయోగాత్మకమైన విజ్ఞాన దాయకమైన అనుభవ సారమే కదా..! సామాజిక చైతన్యానికి తోడ్పడే సిద్ధాంతాలు కాలానుగుణ్యంగా మార్పుకు లోనవుతూ వుండాలి. ఎప్పటికెయ్యది మానవ ప్రగతికి తోడ్పడుతుందో తథానుగుణ్యంగా మార్పులను ప్రతి సిద్ధాంతమూ ఆహ్వానించాలి.

వర్తమానాన్ని వదిలి, గతాన్ని ఆలింగించుకోవడంలోనే అభ్యుదయం వుంటుంది అనుకోవడం అవివేకం. అట్లాగే శాస్త్రీయ దృక్పథం లేని, హేతుబద్ధం కాని, ఊహాతీతమైన ఆధ్యాత్మిక వాదాలతో కూడిన తాత్వికత సిద్ధాంతాలు మానవ మనుగడకు మేలు చేస్తాయని నమ్మడమూ, మిథ్యావాదాన్ని సమాజంలో వ్యాపింపచేయడమూ హర్షింపదగిన విషయం కాదు.


పాలక వర్గాన్ని బలపరుస్తూ, పీడిత ప్రజలకు వ్యతిరేకంగా సృష్టించబడిన పురాతన సాహిత్యం భాషాపరంగా గొప్పదే కావొచ్చు గాని, భావనాపరంగా సామాన్యుని అస్తిత్వాన్ని కాలరాసేదిగా కనిపిస్తుంటుంది. ఆధునికత ముసుగులో, ఆధ్యాత్మికత మూసలో ఏర్పడే సాహిత్యం మనిషిని మూఢ విశ్వాసాల్లోకి దిగజార్చడానికి తోడ్పడుతుంది. మానవాతీతమైన శక్తి ఏదో మనిషిని రక్షిస్తుందనే నమ్మకంతో కూడిన ఆత్మ విశ్వాసాన్ని.. ఇటువంటి సాహిత్యం సృష్టిస్తుంది.

దీనికి గల కారణం మూలాల్లోకి వెళ్ళి ఆలోచించినట్లయితే, అనైతికతా చర్యలతో ఆర్థికాపేక్షతో భౌతికవాదులు ఇరుగు పొరుగు సంక్షేమాన్ని కాంక్షించకుండా స్వలాభాపేక్షతో

దోపిడీ విధానాలను అవలంబిస్తూ అనైతిక కొండలుగా పెరిగిపోవడం, వారి మధ్య బతుకు తెరువు కోల్పోయిన లేదా అందు బాటులోకి రాని, అవకాశాలు లేని బలహీన వర్గాలు కులమతాతీతంగా ఆధ్యాత్మిక చింతనతో కూడిన సాహిత్యాన్ని చదువుతుంటారు.

కనిపించని దేవుడు కరుణించి ఏదో వో రోజు వారి వెతలను బాపుతాడనీ నమ్మకాన్ని విశ్వాసాన్నీ మతపరమైన సాహిత్యం మీద పెంచుకుంటాడు. వారి విశ్వాసం ఒక్కోసారి వారికి మానసికానందాన్ని కూడా ఇస్తుంది అనడంలో సందేహం లేదు. ఇటువంటి సాహిత్యం పుంఖానుపుంఖాలుగా పుడుతూనే వుంది. సమాజంలో దోపిడీకి గురైన దుఃఖితుల పట్ల కనీసం సానుభూతి చూపలేని భౌతిక వాదులు తెలివిగల మూర్ఖులుగా ప్రవర్తిస్తుంటారు. ప్రపంచీకరణ ఫలితంగా వెలుగులోకి వచ్చిన వలస వాద విద్య మానవ సంబంధాలను తెంచుకుంటూ పరాయికరణకు ఒక కోణంగా నిలుస్తుంది

ప్రజాసాహిత్యానికి ప్రభుత్వపరంగా ఎటువంటి ప్రోత్సాహం వుంటటం లేదు. ప్రజాసాహిత్యం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతి పక్షం స్థానంలో నిలబడుతుంది గనుకనే ప్రభుత్వం దీన్ని ఆదరించడం లేదు. అట్లాగనీ దీన్ని ప్రజలూ ఆదరించడం లేదు. కనీసం సామాన్య జనం సాహిత్యాన్ని చదివే అలవాటు కూడా చేసుకోవడం లేదు. సాహిత్యాన్ని చదివించే మార్గాన్వేషణ కనీసం స్వచ్ఛంద సేవా సంస్థలైనా చేపట్టడం లేదు. సాహిత్యసేవాసమస్థలుగా ఆవిర్భవించిన స్వచ్ఛంద సేవా సమస్థలు కీర్తి కండూతితో ఫోటోలకు ఫోజులిస్తూ వార్తా పత్రికల్లో కనిపించే కార్యక్రమాలకు కట్టుబడి పోతున్నాయి. .






ఏ సాహిత్యసమస్థ కూడా నేటి సాహిత్యం సమాజానికి దూరమవుతున్న తీరుతెన్నులను క్షుణ్ణంగా చర్చించి చర్యలు తీసుకునే దశలో లేదు. స్వార్థపూరిత వర్గాలతో, వాదాలతో కొట్టుమిట్టాడుతూ మూసాగతమైన సాహిత్యాన్నే కొనసాగేందుకు దోహదపడుతూ సాహిత్యసమస్థలు కంటి తుడుపు చర్యలు చేపడుతున్నాయి. అందుకే సాహిత్యం విలువలు దినదిన ప్రవర్ధ మానంగా దిగజారుతున్నాయి. కవి సమ్మేళ నాలు, కంటి తుడుపు తంతు సమ్మేళనాలుగా జరిగిపోతున్నాయి. యువత సాహిత్యానికి ఆకర్షితులు కావడం లేదు. దీనికి గల కారణా న్ని అన్వేషించాల్సిన అవసరం ఎంతైనా వుంది.

కాలంతో పాటు, కాలం వడిని అందుకునే విధంగా సాహిత్యలో మార్పులు రావడం లేదు. సాహిత్యంలో అనంతాన్వేష ణ వుండాలి. ఏ ప్రక్రియలో సాహిత్యం వున్నప్ప టికీ సమాజ స్థితిగతుల మీద సామాజిక సిద్ధాంతాల మీద అవగాహన కలిగించే సాహి త్యం పుట్టాలి. సిద్ధాంతాల మీద సాపేక్ష అవగాహన కల్గించే విధంగా సాహిత్యం వెలు వడాలి. ఎక్కడ నుంచి దిగుమతైన ఏ సిద్ధాం తమైన భారత దేశ నైసర్గిక స్వరూప స్వభావా లకనుగుణంగా మార్పులు జరగాలి.

రాజకీయ సిద్ధాంతాల్లో వున్న చైతన్యాన్ని తేటతెల్లపరచడానికి నడుము కట్టుకున్న సాహిత్యం రాజకీయ నాయకుల స్వార్థచింతనను, కుళ్ళు, కుతంత్రాలను ఎత్తి చూపడానికి వెనుకాడుతుంది. అంటే సాహితీవేత్తలు కూడా ఒక విధంగా పార్టీ మూస సిద్ధాంతాల్లో కూరుకుపోవడమే కారణం కావచ్చు. సాహితీవేత్తలు నమ్మిన సిద్ధాంతాలను వ్యక్తీకరించడానికి సాహిత్యాన్ని వాహకంగా వాడుకుంటున్నారు. ఆ పార్టీల్లో జరిగే నాయకత్వ అవలక్షణాలను స్వార్థచింతనను, సంకుచిత స్వభావాలతో కూడిన దురాభిమానాలను, ఖండించలేక పోతున్నాయి. పార్టీల అవలక్షణాల కారణంగా సాహిత్య విలువలు తగ్గుతాయి అనేది నగ్నసత్యం. సాహిత్యం మూస సిద్ధాంతాల నుండి బయటపడాలి.

కాలంతో పాటు సాహిత్యం ఎప్పటికప్పుడు ఆధునాతనంగా 'రీచార్జి' అయి మనుగడ సాగించేందుకు విశ్వవిద్యాలయాలు దోహదపడాలి. కానీ, మన విశ్వవిద్యాలయాలు మాత్రం వర్తమానంలో నడుస్తున్న సమాజానికి వందేళ్ళ వెనక నడుస్తూ గత సాహిత్య చరిత్ర మీద పరిశోధనలు జరుపుతుంటారు. భవిషత్ సాహిత్యం  ఎలా వుండాలి..? అనే సెమినార్స్ జరుపరు. చర్చలు చేయరు. సాహిత్య అకాడెమీలు మొక్కుబడి సెమినార్స్ జరుపుతూ వారికి కెటాయించిన నిధులను ఖర్చు చేసి చేతులు దులుపుకుంటున్నారు. నేడు తీవ్రంగా సాహిత్య సృజన చేస్తున్న కవులు, రచయితలు వీరి దృష్టిలో వుండరు. వీరికి దొరికే అడ్రసులు, పూర్వం విశ్వవిద్యాలయాల్లో పని చేస్తూ పదవీ విరమణ చేసిన వారు మాత్రమే..! అట్టి వారైనా, నేడు సాహిత్యాన్ని పరిశీలించి సత్‌సంబంధాలు కలిగి యున్నవారుగా ఉండరు. కలాలను అటకెక్కించి పూర్తిగా విశ్రాంతి తీసుకుంటున్న వారే ప్రధానోపన్యాసకులుగా ఆహ్వానిస్తుంటారు. అందుకే సాహిత్యం వేసిన గొంగళి వేసిన దిక్కనే వుంటుంది. వస్తురూపంలో గానీ, శిల్పరూపంలో గాని, అభివ్యక్తీపరంగా గాని, సాహిత్యంలో పెద్ద మార్పులు నేటికీ గోచరించవు.

తెలుగు సాహిత్యం జనామోదయోగ్యంగా మారాలంటే సాహిత్యంలో మౌలికమైన మార్పులు చోటు చేసుకోవాలి. జనానికి దగ్గరగా వుండి జీవన విధానంలో మార్పును సూచించే విధంగా వుండాలి. వస్తువైవిధ్యం, శిల్పం, అభివ్యక్తిలో కొత్తదనం సంతరించుకోవాలి. అప్పుడే తెలుగు సాహిత్యానికి పాఠకులు పెరుగుతారని ఆశిద్దాం.. ●



ESTD. - 1997

VIVEK CLASSES

# VIVEK CLASSES

((Classes Known for Best Results))

New Branch Opened Behind Jijamata Bus Stop For Following.....

e-class™ Learning Centre

## Kinder Garden

(PLAY GROUP, NURSERY, JR. KG, & SR. KG)

Ist to IVth

Vth to IXth

S. S. C

H. S. C Commerce
(S.P/ Maths/IT)

Admission Started for the Academic Year 2014-2015

Private S.S.C And H.S.C Commerce Batches

Advt.

Contact : 9769258327 / 9664548299 /9029211830

**Head Office :**
B.D.D. Chawl No. 84/19,
Ground Floor, Worli,
Mumbai-400 018.

**Branch :**
Behind Jijamata Bus Stop,
Nalanda Gyan Kalamandir,
Worli, Mumbai - 13.

# HORIZON GROUP
Builders & Developers





A-245, Balaji Bhavan,
Plot No. 42A,
Sector-11,
CBD Belapur,
Navi Mumbai - 400 614

**Tel.: 022-27560442**
**E-mail: reddymk@gmail.com**
**www.horizonlivingspaces.com**